
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు
బుధవారం 5 జూన్ 2024








# వార్ వన్‌సైడ్

## ఎంపీ సహా అన్ని స్థానాల్లో టీడీపీ గెలుపు







బైరెడ్డి శబరి, నంద్యాల ఎంపీ




భూమా అఖిలప్రియ, ఎమ్మెల్యే ఆళ్లగడ్డ




కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి, ఎమ్మెల్యే, డోన్



ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్యే నంద్యాల



బీసీ జనార్దన్ రెడ్డి, ఎమ్మెల్యే బనగానపల్లె



గిత్తా జయసూర్య, ఎమ్మెల్యే, నందికొట్కూరు



బుడ్డా రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్యే, శ్రీశైలం



గౌరు చరిత, ఎమ్మెల్యే, పాణ్యం

నంద్యాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి ఓటు వేయకపోతే పథకాలు రావంటూ వలంటీర్లతో బెదిరించారు. ఓటుకు రెండు వేల చొప్పున డబ్బు ఎర వేశారు. పోలింగ్ రోజు మధ్యాహ్నం నుంచి వలంటీర్లతో ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించి, తమకు ఓటు వేసేలా వైసీపీ నాయకులు ప్రేరేపించారు. పింఛను ఇంటికి చేరకుండా టీడీపీ అడ్డుకుందనే అపోహను ప్రజల్లో పెంచి తద్వారా ఎన్నికల్లో లాభపడదామన్న ఉద్దేశంతో పింఛను లబ్ధిదారులను మండుటెండల్లో రోడ్ల మీదకు వచ్చేలా కుట్రలు పన్నారు. ఇన్ని చేసినా వైసీపీ మాత్రం చివరకు ఓటమి చవిచూడాల్సి వచ్చింది. జిల్లా ప్రజలు మాత్రం వైసీపీ చేసిన అరాచకాలను గమనిస్తూ వచ్చారు. ఓటు ఎవరికి వేస్తున్నది, వేశామన్నది బయటకు చెప్పకుండా ఓటర్లు తాము చేయాలనుకున్నది చేశారు. అధికార పార్టీకి కర్రుకాల్చి వాతపెట్టినట్లు టీడీపీకి ఏకపక్షంగా సీట్లను కట్టబెట్టారు. జిల్లాలోని మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులకు విజయాన్ని అందించారు. ఎంపీ అభ్యర్థిని కూడా గెలిపించారు. ఫలితాలను చూసి వైసీపీ అభ్యర్థులు షాక్‌కు గురయ్యారు. తమ పార్టీ పట్ల ఈ స్థాయిలో వ్యతిరేకత ఉందనే విషయాన్ని జీర్ణించుకోలేక ఓటమి భారంతో కుంగిపోతున్నారు. మొత్తం మీద జిల్లాలో జెండాను ఎగురవేసి టీడీపీ నేతలు క్లీన్ స్వీప్ విజయాన్ని సాధించారు.

### కష్టం ఫలించింది..

జిల్లాకు సంబంధించి అభ్యర్థులను ప్రకటించినప్పుడు కొన్ని నియోజకవర్గాల్లో అసంతృప్తులు చెలరేగాయి. కొంతమంది పెదవి టీడీపీ అభ్యర్థుల ఎంపికపై పెదవి విరిచారు. వైసీపీ గెలుపు సునాయాసమే అని భావించారు. జిల్లా మొత్తం మీద రెండు అసెంబ్లీ సీట్లైనా టీడీపీ గెలుస్తుందా? అన్న అనుమానాన్ని వెలిబుచ్చారు. ఈ అనుమానాలను పటా పంచలు చేస్తూ అభ్యర్థులు విజయబావుటా ఎగుర వేశారు. పట్టు లేని గ్రామాల్లో కూడా ఓట్లను రాబట్టడంలో బాగా కృషి చేశారని తెలుస్తోంది. మొత్తం మీద టీడీపీ అభ్యర్థుల కష్టానికి తోడు, ప్రభుత్వ వ్యతిరేకత వల్ల జిల్లాలో టీడీపీ అభ్యర్థులు క్లీన్‌స్వీప్ విజయాన్ని సాధించారు.



### ప్రభావం చూపని కాంగ్రెస్..

జిల్లాలో ప్రధాన పోటీ టీడీపీ, వైసీపీ మధ్యే ఉన్నా కాంగ్రెస్ కూడా పార్లమెంటు సహా అన్ని నియోజకవర్గాల్లో తమ అభ్యర్థులను నిలబెట్టింది. అందరూ కాకపోయినా.. నందికొట్కూరు నుంచి తోగూరు ఆర్థర్, నంద్యాల అసెంబ్లీ నుంచి బరిలోనికి దిగిన గోకుల్ కృష్ణారెడ్డి కాస్తో కూస్తో ప్రభావం చూపెడతారనుకున్నారు. అయితే కాంగ్రెస్ ప్రజల ఓట్లను తమ వైపుకు తిప్పుకునేలా ఈ ఇద్దరు ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. ఓ రకంగా వీరిద్దరు ఓట్లను సాధించడంలో అనామకులను తలపించారు. ఇక ఎంపీ అభ్యర్థిగా నిలబడిన నరసింహయాదవ్ కూడా ఏమాత్రం ప్రభావం చూపలేదు.

### అన్ని నియోజకవర్గాల్లో..

జిల్లాలో మొత్తం పాణ్యం నియోజకవర్గంలోని పాణ్యం, గడివేముల మండలాలతో కలిపి ఏడు నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ ఏడు నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులు విజయదుందుభి మోగించారు. డోన్ నుంచి మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, పాణ్యం నుంచి గౌరు చరిత, బనగానపల్లె నుంచి బీసీ జనార్దన్‌రెడ్డి, నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి, ఎన్ఎండీ ఫరూఖ్, నందికొట్కూరు నుంచి జయసూర్య, శ్రీశైలం నుంచి బుడ్డా రాజశేఖరరెడ్డి, ఆళ్లగడ్డ నుంచి భూమా అఖిలప్రియ విజయం సాధించారు. ఇక గత ఎన్నికల్లో నంద్యాల పార్లమెంటు నుంచి భారీ విజయం సాధించిన వైసీపీ అభ్యర్థి మీద బైరెడ్డి శబరి ప్రస్తుత ఎన్నికల్లో పై చేయి సాధించి టీడీపీ జెండా ఎగురవేశారు.



### రౌండు రౌండుకు ఆధిక్యం..

ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు మొదలైన కాసేపటికే ఈవీఎం లెక్కింపు మొదలైంది. మొదటి రౌండు నుంచే టీడీపీ అభ్యర్థులు ఆధిక్యం చూపడం మొదలుపెట్టారు. ఒకటి రెండు నియోజకవర్గాలు మినహా అన్ని నియోజకవర్గాల్లోనూ టీడీపీ అభ్యర్థులు దూసుకుపోయారు. ప్రతి రౌండులోనూ ఐదు వందలకు పైగా మెజారిటీ చూపారు. కొన్ని నియోజకవర్గాల్లో అయితే రెండు వేలు, మూడు వేల ఓట్ల మెజారిటీ కూడా వచ్చిన సందర్భాలు ఉన్నాయి. దీంతో ఆయా నియోజకవర్గాలకు సంబంధించి ఇంకా రౌండ్లు మిగిలి ఉండగానే టీడీపీ అభ్యర్థుల విజయం ఖాయమైంది. ఇక ఒకటి రెండు నియోజకవర్గాల్లో మాత్రం టీడీపీ అభ్యర్థులు కొన్ని రౌండ్లలో వెనుకపడ్డారు. అయితే మలి రౌండుకు మళ్లీ పుంజుకుని ఆధిక్యం చూపారు. చివరి రౌండుకు వచ్చే సరికి వైసీపీ అభ్యర్థులను ఓడించి విజయం అందుకున్నారు.







# ప్రభంజనం

ఏపీ తీర్పు @ 2024

పడిలేచిన కెరటంలా టీడీపీ తన సత్తా ఏంటో చూపించింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో అన్ని స్థానాలను కోల్పోయిన తెలుగుదేశం 2024 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 12 స్థానాల్లో విజయాన్ని అందుకుంది. అలాగే రెండు ఎంపీ స్థానాలనూ కైవసం చేసుకుంది. గత ఎన్నికల్లో వైసీపీ క్లీన్ స్వీప్ చేసినా ఏ మాత్రం డీలా పడకుండా తిరిగి పుంజుకొని చావు దెబ్బకొట్టింది. ఇంతలా టీడీపీకి ఆదరణ లభిస్తుందని ఊహించని వైసీపీ శ్రేణులు ఫలితాలను చూసి షాక్‌కు గురయ్యాయి. ఇంతగా ఓటమి చవిచూస్తామని కలలో కూడా అనుకోలేదని మదనపడుతున్నాయి.





# టీడీపీ కూటమి విజయకేతనం



కర్నూలు పట్టణంలో బాణసంచా కాలుస్తున్న టీడీపీ నాయకులు

- రౌండు రౌండుకు ఆధిక్యత
- 50.07 శాతం ఓట్లతో స్పష్టమైన మెజారిటీ
- పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరితకు 40.591 వేల ఓట్లు
- కొండారెడ్డి బురుజుపై ఎగిరిన టీడీపీ జెండా
- 40 ఏళ్ల తరువాత కోడుమూరులో పసుపు జెండా ఎగరేసిన దస్తగిరి
- జిల్లాలో చరిత్రలో బీజేపీ బోణీ.. ఆదోని కోటపై కాషాయ జెండా ఎగరేసిన డాక్టర్ పార్థసారధి
- చేనేతపురి ఎమ్మిగనూరులో బీవీ విజయకేతనం
- ఎంపీటీసీ నుంచి ఎంపీగా బస్తిపాటి నాగరాజు

**కర్నూలు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి స్పష్టమైన ఆధిక్యత సాధించింది. కర్నూలు పార్లమెంట్ స్థానం సహా కర్నూలు, కోడుమూరు (ఎస్సీ), ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆదోని నియోజకవర్గాల్లో విజయం సాధించింది. టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు వ్యూహాలు ఫలించాయి. యువనేత నారా లోకేశ్ యువగళం పాదయాత్ర ప్రజల్లో ఆలోచన కలిగేలా చేసింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రచారం భరోసా ఇచ్చింది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కమిట్‌మెంట్ ప్రజలను మెప్పించింది. వెరసి టీడీపీ సునామీ సృష్టించింది. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మే 13న ఓటర్లు తీర్పు ఇచ్చారు. ఈవీఎం యంత్రాలలో నిక్షిప్తమైన తీర్పును ఓట్ల లెక్కింపు ద్వారా మంగళవారం వెల్లడించారు. రాయలసీమ యూనివర్సిటీ కేంద్రంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు డాక్టరు జి. సృజన పర్యవేక్షణలో కర్నూలు పార్లమెంట్ స్థానంలో పాటు కర్నూలు, కోడుమూరు (ఎస్సీ), ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, సహా నంద్యాల పార్లమెంట్ పరిధిలోని పాణ్యం నియోజకవర్గం ఓట్ల లెక్కింపు జరిగింది. కర్నూలు లోక్‌సభ స్థానంలో పరిధిలో మొత్తం 17,22,857 ఓట్లకు గాను ఈవీఎంలో 13,23,072 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 17,196 కలిపి 13,40,272 ఓట్లు లెక్కించారు. అలాగే.. 8 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 20,54,563 ఓట్లకు గాను పోలైన ఈవీఎంలో 15,70,007 ఓట్లు, 23,088 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కలిపి 15,93,095 ఓట్లు లెక్కించారు. ఒక్కో నియోజకవర్గానికి 14 చొప్పున టేబుళ్లు ఏర్పాటు చేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఒచ్చిన ఓట్లను లెక్కించారు. టీడీపీ కూటమి 7,94,671 ఓట్లు సాధించి (50.07 శాతం) స్పష్టమైన ఆధిక్యతను దక్కించుకుంది. కర్నూలు ఎంపీతో పాటు ఆరు అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ కూటమి విజయం సాధించింది. అధికార వైసీపీ మంత్రాలయం, ఆలూరులో విజయం సాధించినా.. ఆలూరు టీడీపీ అభ్యర్థి బి. వీరభద్రగౌడ్ రీ కౌంటింగ్ కోరడంతో ఆ నియోజకవర్గం ఫలితం పెండింగులో పెట్టారు.

**● ఎంపీటీసీ నుంచి ఎంపీ బస్తిపాటి నాగరాజు:**

కర్నూలు లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన పంచలింగాల బస్తిపాటి నాగరాజు ఎంపీటీసీ సభ్యుడి నుంచి ఎంపీగా ఎంపికై సరికొత్త రికార్డు సొంతం చేసుకున్నారు. కర్నూలు పార్లమెంట్ స్థానం పరిధిలో పోలైన 13,40,272 ఓట్లు లెక్కించారు. బస్తిపాటి నాగరాజు 6,58,914 ఓట్లు సాధించి ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి బీవై రామయ్యపై 1,11,298 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. బీవై రామయ్యకు 5,47,616 ఓట్లు వచ్చాయి.

## ఎస్వీ తర్వాత తిక్కారెడ్డిదే ఆ విజయం..

**● 1999 తర్వాత టీడీపీ మెజార్టీ అభ్యర్థులు గెలుపు.. ● 1984, 1999 తర్వాత ఎంపీగా బస్తిపాటి**



**కర్నూలు(అర్బన్), జూన్ 4:** తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు అత్యధిక అసెంబ్లీ స్థానాల్లో గెలుపు.. జిల్లా అధ్యక్షుడిగా ప్యాలకుర్తి తిక్కారెడ్డి గౌరవం దక్కింది. 1994 తర్వాత అప్పటి జిల్లా అధ్యక్షుడు ఎస్వీ సుబ్బారెడ్డి రికార్డును బ్రేక్ చేశారు. మంగళవారం జరిగిన కౌంటింగ్‌లో ఎక్కువ మంది అభ్యర్థులు గెలుపొందడం జిల్లాలో చర్చనీయాంశమైంది. ఫలితాలు వెలువడిన అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో తిక్కారెడ్డి నాయకులు, కార్యకర్తలతో కలిసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా 1994 ఎస్వీ సుబ్బారెడ్డి తర్వాత తిక్కారెడ్డి నాయకత్వంలోనే అత్యధిక స్థానాలో గెలుపు దక్కింది. 1994వ సంవత్సరంలో అప్పటి 13 నియోజకవర్గాల్లో టీడీపీ-9, సీపీఎం-1, కాంగ్రెస్-3 స్థానాలు గెలుచుకున్నాయి. అప్పట్లో అభ్యర్థుల గెలుపులో ఎస్వీ సుబ్బారెడ్డి అధ్యక్షుడిగా ఉన్నారు. ఆ తర్వాత ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో రెండు సీట్లు మినహా టీడీపీ అభ్యర్థులు స్వీప్ దిశగా గెలుపు సాధించారు. నంద్యాల జిల్లాలో టీడీపీ స్వీప్ చేయగా, కర్నూలు జిల్లాలో అలూరు, మంత్రాలయంలో మాత్రమే వైసీపీ అభ్యర్థులు గెలుపొందారు. ఈ క్రమంలో 1999లో టీడీపీ-8, కాంగ్రెస్-4, 2004 పత్తికొండ అసెంబ్లీ నుంచి అప్పటి జిల్లా అధ్యక్షుడు ఎస్వీ సుబ్బారెడ్డి గెలుపొందారు. 2009లో డోన్, పత్తికొండ, ఆదోని, మంత్రాలయంలో గెలుపొందగా 2014లో బనగానపల్లె, డోన్, ఆదోని, 2019లో వైసీపీ 14 సీట్లు గెలుపొందింది. టీడీపీ ఒక్క సీటు కూడా గెలుచులేకపోయింది. ప్రస్తుతం ఇదే పరిస్థితి దాదాపుగా వైసీపీకి ఎదురైంది. ఎన్నికల కౌంటింగ్‌లో ఉమ్మడి జిల్లాలో 11 మంది టీడీపీ అభ్యర్థులు గెలుపొందడం విశేషం. నంద్యాల జిల్లాలో స్వీప్ చేయగా కర్నూలు జిల్లాలో రెండు సీట్లు వైసీపీ గెలుపొందింది. 1984, 1999 తర్వాత మంగళవారం జరిగిన కౌంటింగ్‌లో టీడీపీ ఎంపీగా బస్తిపాటి నాగరాజు గెలుపొందారు. 1984లో ఏరాసు అయ్యపరెడ్డి, 1999లో కేఈ క్రిష్ణమూర్తిలు కర్నూలు ఎంపీలుగా గెలుపొందారు. తాజాగా టీడీపీ ఎంపీగా బస్తిపాటి నాగరాజు గెలిచారు.

ఉమ్మడి జిల్లాలో సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు మంగళవారం అధికారులు డిక్లరేషన్ పత్రాలను అందజేశారు. అందుకున్న ఎమ్మెల్యేలు వీరే...



పత్తికొండ ఆర్వో నుంచి డిక్లరేషన్ అందుకుంటున్న కేఈ శ్యాంబాబు



ఆదోని ఆర్వో నుంచి డిక్లరేషన్ అందుకుంటున్న పార్థసారధి



బనగాపల్లె ఆర్వో నుంచి డిక్లరేషన్ అందుకుంటున్న బీసీ జనార్దన్‌రెడ్డి



ఆళ్లగడ్డ ఆర్వో నుంచి డిక్లరేషన్ అందుకుంటున్న భూమా అఖిలప్రియ



కోడుమూరు ఆర్వో నుంచి డిక్లరేషన్ అందుకుంటున్న దస్తగిరి



కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ గెలుపొందడంతో అభినందనలు తెలుపుతున్న కుటుంబ సభ్యులు



శ్రీశైలం ఆర్వో నుంచి డిక్లరేషన్ అందుకుంటున్న బుడ్డా రాజశేఖర్‌రెడ్డి



నందికొట్కూరు ఆర్వో నుంచి డిక్లరేషన్ అందుకుంటున్న గుత్తా జయసూర్య



ఎమ్మిగనూరు ఆర్వో నుంచి డిక్లరేషన్ అందుకుంటున్న బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి



కలెక్టర్ నుంచి డిక్లరేషన్ అందుకుంటున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు



డోన్ ఆర్వో నుంచి డిక్లరేషన్ అందుకుంటున్న కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి



నంద్యాలలో ఆర్వో నుంచి డిక్లరేషన్ అందుకుంటున్న ఫరూక్ సోదరుడు



మంత్రాలయం ఆర్వో నుంచి డిక్లరేషన్ అందుకుంటున్న బాలనాగిరెడ్డి అన్న కొడుకు ప్రదీప్‌రెడ్డి



ఆలూరు ఆర్వో నుంచి డిక్లరేషన్ అందుకుంటున్న విరూపాక్షి



పాణ్యం ఆర్వో నుంచి డిక్లరేషన్ అందుకుంటున్న గౌరు చరిత



కలెక్టర్ నుంచి డిక్లరేషన్ అందుకుంటున్న నంద్యాల ఎంపీ శబరి





## ఫ్యాన్ విలవిల

రాష్ట్రంలో టీడీపీ ప్రభంజనం సృష్టించడంతో తెలుగు తమ్ముళ్లు తమదైన శైలిలో సంబరాలు చేసుకున్నారు. అందులో భాగంగా కోడుమూరు పట్టణంలో ఫ్యాన్‌ను సైకిల్‌కు కట్టి ఈడ్చుకెళ్తున్న టీడీపీ అభిమాని



కర్నూలు టీడీపీ కార్యాలయంలో సంబరాలు



ఎమ్మిగనూరులో సంబరాలు

టీడీపీ భారీ మెజార్టీతో గెలుపొందడంతో జిల్లాలో సంబరాలు అంబరాన్నంటాయి. కొందరు స్వీట్లు, బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.







గౌరు దంపతులు, పార్థసారధి విక్టరీ సంకేతం





ఎమ్మిగనూరు, ఓర్వకల్లులో ఆసక్తిగా వార్తలను తిలకిస్తున్న శ్రేణులు

# అయ్యో.. జొకో

**గాయంతో ఫ్రెంచ్ ఓపెన్ నుంచి అవుట్**

**సెమీస్‌కు గాఫ్, స్వియటెక్**



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో అనూహ్య పరిణామం. 25వ గ్రాండ్‌స్లామ్ వేటలోనున్న పురుషుల డిఫెండింగ్ చాంప్, వరల్డ్ నెంబర్‌వన్ నొవాక్ జొకోవిచ్ టోర్నీ నుంచి వైదొలిగాడు. కుడి మోకాలి గాయం కారణంగా జొకో క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్ ఆడడం లేదని నిర్వాహకులు మంగళవారం ప్రకటించారు. ఫ్రాన్సిస్కోతో జరిగిన ప్రీక్వార్టర్స్ పోరును అతికష్టమ్మీద నెగ్గిన జొకోవిచ్.. ఆ మ్యాచ్‌లో పలుమార్లు ఇబ్బందిపడ్డాడు. ఈ క్రమంలో నొప్పితోనే ఆ మ్యాచ్‌ను కొనసాగించిన జొకో.. చివరకు ఐదుసెట్ల పాటు పోరాడి గట్టెక్కాడు. మ్యాచ్ తర్వాత ఎమ్ఆర్ఐ స్కానింగ్ తీయించగా, గాయమైనట్టు బయటపడింది. దీంతో జొకోతో క్వార్టర్‌ఫైనల్స్‌లో తలపడాల్సిన కాస్పర్ రూడ్ వాకోవర్‌తో నేరుగా సెమీఫైనల్ చేరాడు. క్వార్టర్స్‌కు ముందే నిష్క్రమించడంతో జొకోవిచ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో తన నెంబర్‌వన్ స్థానాన్ని రెండోసీడ్ జానిక్ సిన్నర్‌కు కోల్పోనున్నాడు. ఇక, సిన్నర్ 6-2, 6-4, 7-6(3)తో దిమిత్రోవ్‌ను చిత్తుచేసి సెమీఫైనల్‌కు దూసుకెళ్లగా.. జ్వెరెవ్ 4-6, 6-1, 5-7, 7-6(2), 6-2తో హోల్గర్ రూన్‌ను ఓడించి క్వార్టర్స్ చేరాడు. మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ స్వియటెక్, మూడోసీడ్ కొకొ గాఫ్ సెమీఫైనల్లో అమీతుమీకి సిద్ధమయ్యారు. క్వార్టర్‌ఫైనల్స్‌లో స్వియటెక్ 6-0, 6-2తో ఐదోసీడ్ వొంద్రుసోవాను ఓడించగా.. గాఫ్ 4-6, 6-2, 6-3తో 8వ సీడ్ జెబ్యూర్‌పై విజయం సాధించింది.

# వేటకు వేళాయె!

**టీ20 ప్రపంచకప్‌లో తొలి పోరుకు భారత్ సై**

**నేడు ఐర్లాండ్‌తో ఢీ**

**రాత్రి 8 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..**


రోహిత్

న్యూయార్క్: భారత క్రికెట్ అభిమానులంతా ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్న తరుణం రానేవచ్చింది. టీ20 ప్రపంచకప్ గ్రూప్ 'ఎ'లో భాగంగా బుధవారం తమ తొలి మ్యాచ్‌ను ఐర్లాండ్‌తో ఆడనుంది. 2007లో తొలి ప్రపంచ కప్‌ను అందుకున్నాక భారత జట్టుకు ఈ మెగా టోర్నీ ఊరిస్తూనే ఉంది. కెప్టెన్ రోహిత్, విరాట్ కోహ్లీలాంటి అనుభవజ్ఞులు.. సూర్యకుమార్, పంత్, బుమ్రాలాంటి యువ ఆటగాళ్ల సహకారంతో ఈసారైనా కప్‌ను ఖాతాలో వేసుకోవాలనుకుంటోంది. ఇక తాజా టోర్నీలో చిన్న జట్లు అద్భుతంగా పోరాడుతున్న సమయంలో ఐర్లాండ్‌ను తక్కువగా అంచనా వేయడానికి లేదు. అలాగే ఈ జట్టుకు గతంలో పెద్ద జట్లకు షాకిచ్చిన అనుభవం కూడా ఉంది. ఆసీస్‌లో జరిగిన చివరి వరల్డ్‌కప్‌లో ఈ జట్టు ఇంగ్లండ్‌ను ఓడించింది. అలాగే ఇటీవల పాక్‌ను కూడా మట్టికరిపించింది. బల్బిర్నీ, స్టిర్లింగ్, వికెట్ కీపర్ టక్కర్‌లతో పాటు పేసర్ జోషువా లిటిల్ జట్టులో కీలక ఆటగాళ్లు. అటు స్థానిక నసౌ కౌంటీ క్రికెట్ స్టేడియంలో డ్రాప్ ఇన్ పిచ్ ఎలా స్పందిస్తుందనేది ఇరు జట్లకు సవాల్‌గా మారింది. ఐపీఎల్ మాదిరి ఇక్కడ బ్యాటర్లు చెలరేగుదామనుకుంటే బోర్లా పడక తప్పదు. మంగళవారం దక్షిణాఫ్రికా-శ్రీలంక మధ్య జరిగిన మ్యాచ్ ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఐర్లాండ్‌తో ఆడిన ఏడు టీ20ల్లోనూ భారత్ గెలిచింది.


స్టిర్లింగ్

**ఓపెనింగ్ ఎవరో?:** ఈ టోర్నీలో భారత్ ఓపెనర్లుగా ఎవరిని బరిలోకి దింపుతారనేది చర్చనీయాంశంగా మారింది. కోచ్ ద్రవిడ్ ఈ విషయమై స్పష్టత ఇవ్వకపోయినా.. రోహిత్‌కు జతగా కోహ్లీని ఆడించే అవకాశం ఉంది. అలా జరిగితే జైస్వాల్ బెంచీకే పరిమితమవుతాడు. ఐపీఎల్ ఫామ్‌ను విరాట్ ఇక్కడా కొనసాగిస్తే జట్టుకు లాభమే. వికెట్ కీపర్‌గా పంత్ ఆడడం ఖాయమే. సూర్యకుమార్‌తో పాటు శివమ్ దూబే, హార్దిక్ మిడిలార్డర్‌లో రానున్నారు. ఇక్కడి పిచ్ స్పిన్‌కు అనుకూలించనుండడంతో లెఫ్టామ్ స్పిన్నర్లు జడేజా, అక్షర్‌లతో పాటు కుల్దీప్‌ను సైతం ఆడించనున్నారు. అయితే బుమ్రాకు జతగా రెండో పేసర్‌గా సిరాజ్, అర్ష్‌దీప్‌లలో ఎవరిని ఎంపిక చేయాలనే డైలమాలో టీమ్ మేనేజ్‌మెంట్ ఉంది. హార్దిక్ మూడో పేసర్‌గా సేవలందించనున్నాడు.

**తుది జట్లు (అంచనా)**

**భారత్:** రోహిత్ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, పంత్, సూర్యకుమార్, దూబే, హార్దిక్, జడేజా, అక్షర్, కుల్దీప్, బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్.

**ఐర్లాండ్:** బల్బిర్నీ, స్టిర్లింగ్ (కెప్టెన్), టక్కర్, టెక్టర్, కాంఫర్, డాకోరెల్, డిలానీ, అడెయిర్, మెక్‌కార్తి, యంగ్, లిటిల్.

**పిచ్, వాతావరణం:** పిచ్ స్పందనపై అనిశ్చితి కొనసాగుతోంది. చివరి మ్యాచ్‌లో శ్రీలంక 77 పరుగులకు కుప్పకూలింది. అటు సఫారీలు కూడా ఇబ్బందిపడ్డారు. స్పిన్, పేస్‌కు కూడా అనుకూలించడం సానుకూలాంశం.

## ప్రణయ్‌కు రజావత్ షాక్

**'ఇండోనేసియా'లో గాయత్రి జోడీ ముందంజ**

జకార్తా: ఇండోనేసియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ హెచ్‌ఎస్ ప్రణయ్‌కు చుక్కెదురైంది. భారత్‌కే చెందిన యువ ఆటగాడు ప్రియాన్షు రజావత్ 21-17, 21-12తో మాజీ వరల్డ్ నెంబర్‌వన్ ప్రణయ్‌కు షాకిచ్చి రెండోరౌండ్ చేరాడు. మరో ఆరంభ రౌండ్ పోరులో లక్ష్యసేన్ 21-12, 21-17తో కెంటా సునెయామ (జపాన్)ను ఓడించాడు. ఇతర భారత షట్లర్లలో మహిళల డబుల్స్ ద్వయం గాయత్రి/ట్రీసా జాలీ, మిక్స్‌డ్ జోడీ సుమిత్/సిక్కి రెడ్డి ప్రత్యర్థులపై గెలిచి రెండోరౌండ్లో ప్రవేశించారు.

## విహారికి ఎన్‌ఓసీ!

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రంజీ జట్టు ఎంపికపై ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ)-క్రికెటర్ హనుమ విహారి మధ్య గత సీజన్‌లో జరిగిన వివాదం గుర్తుందిగా! అప్పటి నుంచి తాను వేరే రాష్ట్రానికి ఆడతానని, ఇందుకోసం ఎన్‌ఓసీ (నిరభ్యంతర పత్రం) ఇవ్వాలంటూ రెండు నెలల్లో విహారి నాలుగుసార్లు ఈమెయిల్స్ పంపించినా స్పందించని ఏసీఏ.. ఏపీలో ఎన్నికల ఫలితాల్లో వైసీపీ పార్టీ ఘోరంగా ఓడడంతో ఒక్కసారిగా దిగొచ్చింది. ఈనెల 3వ తేదీన ఎన్‌ఓసీ జారీ చేసినట్టు లేఖ తయారు చేసి, విహారికి పంపించింది. కాగా, ఏపీ ఎన్నికల్లో గెలిచిన ఎన్డీఏ కూటమికి 'ఎక్స్'లో అభినందనలు తెలిపిన విహారి.. 'కర్మ ఎవరినీ ఉపేక్షించదు' అని పోస్ట్ చేయడం గమనార్హం.

## ఐదేసిన ఫరూఖీ

- అఫ్ఘానిస్థాన్ శుభారంభం
- 125 పరుగులతో ఉగాండా చిత్తు



ప్రావిడెన్స్ (గయానా): టీ20 వరల్డ్‌కప్‌ను అఫ్ఘానిస్థాన్ ఘన విజయంతో ఆరంభించింది. రహ్మానుల్లా గుర్బాజ్ (76), ఇబ్రహీం జద్రాన్ (70) అర్ధ శతకాలతోపాటు పేసర్ ఫజల్‌హక్ ఫరూఖీ (5/9) ఐదు వికెట్లతో విజృంభించడంతో.. గ్రూప్-సిలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో అఫ్ఘాన్ 125 పరుగుల తేడాతో ఉగాండాను చిత్తు చేసింది. తొలుత అఫ్ఘాన్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 183 పరుగులు చేసింది. కాస్మాస్, మసాబా చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో ఉగాండా 16 ఓవర్లలో 58 పరుగులకే కుప్పకూలింది. రాబిన్సన్ ఒబుయా (14), రియాజత్ అలీ షా (11) మాత్రమే డబుల్ డిజిట్ స్కోర్లు చేశారు. రషీద్, నవీనుల్ చెరో 2 వికెట్లు తీశారు.



# మదుపరి షాక్.. సూచీలు షేక్



## 'పోల్' పంచ్‌కు రక్తమోడిన దలాల్‌స్ట్రీట్

- ఒకదశలో 6,234 పాయింట్లు పతనమై 70,000 స్థాయికి జారుకున్న సెన్సెక్స్
- చివరికి 4,390 పాయింట్ల నష్టంతో 72,079 స్థాయి వద్ద ముగిసిన సూచీ
- ఇంట్రాడేలో నిఫ్టీ దాదాపు 2,000 పాయింట్లు డౌన్
- చివర్లో 1,379 పాయింట్ల నష్టంతో 21,885 వద్ద క్లోజ్
- గడిచిన నాలుగేళ్లలో ఇదే అతిపెద్ద మార్కెట్ పతనం
- ఒకదశలో దాదాపు రూ.40 లక్షల కోట్ల సంపద ఉఫ్
- రూ.31 లక్షల కోట్ల నష్టంతో రూ.394.83 లక్షల కోట్లకు పడిపోయిన బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్

ముంబై: లోక్‌సభ ఎన్నికల ఫలితాలు స్టాక్ మార్కెట్‌ను భారీగా కుదిపేశాయి. ఎన్డీఏకు సీట్లు 300 కంటే తగ్గడంతోపాటు బీజేపీకి పూర్తి మెజారిటీ లభించకపోవడం మార్కెట్ వర్గాలను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఇన్వెస్టర్లు అమ్మకాలు పోటెత్తించడంతో మంగళవారం సూచీలు కుప్పకూలాయి. నాలుగేళ్లలో అతిపెద్ద నష్టాన్ని చవిచూశాయి. దాంతో ఎగ్జిట్ పోల్స్ జోష్‌తో సోమవారం ఆర్జించిన లాభాలన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. బీఎస్ఈ సెన్సెక్స్ ఒకదశలో 6,234.35 పాయింట్ల (8.15 శాతం) వరకు క్షీణించి దాదాపు 5 నెలల కనిష్ఠ స్థాయి 70,234.43 వద్దకు పడిపోయింది. ఆ తర్వాత కాస్త కోలుకున్న సూచీ.. చివరికి 4,389.73 పాయింట్ల (5.74 శాతం) నష్టంతో రెండు నెలలకు పైగా కనిష్ఠ స్థాయి 72,079.05 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 1,982.45 పాయింట్లు (8.52 శాతం) పతనమై 21,281.45 వద్దకు పడిపోయింది. ట్రేడింగ్ నిలిచేసరికి సూచీ 1,379.40 పాయింట్ల (5.93 శాతం) నష్టంతో 21,884.50 వద్ద స్థిరపడింది. కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం లాక్‌డౌన్ విధించడంతో 2020 మార్చి 23న సెన్సెక్స్, నిఫ్టీ 13 శాతం మేర క్షీణించాయి. ఆ తర్వాత సూచీలకు ఇదే అతిపెద్ద ఒక్కరోజు నష్టం. అమ్మకాల సునామీలో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.31 లక్షల కోట్లకు పైగా హరించుకుపోయి రూ.394.83 లక్షల కోట్లకు (4.73 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. ఒకదశలోనైతే మార్కెట్ సంపద దాదాపు రూ.40 లక్షల కోట్ల మేర ఆవిరైంది.

**మోదీ సర్కారు హయాంలో నిఫ్టీ అతిపెద్ద నష్టాలు**

| తేదీ | నష్టం | |
|---|---|---|
| | పాయింట్లు | శాతం |
| 2024 జూన్ 4 | 1,379.40 | 5.93 |
| 2022 ఫిబ్రవరి 22 | 531.95 | 3.06 |
| 2021 నవంబరు 26 | 509.80 | 2.91 |
| 2021 ఏప్రిల్ 12 | 524.05 | 3.53 |
| 2021 ఫిబ్రవరి 26 | 568.20 | 3.76 |
| 2020 మార్చి 23 | 1,135.20 | 12.98 |
| 2020 మార్చి 16 | 757.80 | 7.61 |
| 2020 మార్చి 12 | 868.25 | 8.30 |
| 2020 మార్చి 9 | 538.00 | 4.90 |

**మరిన్ని ముఖ్యాంశాలు..**

- ఎన్నికల ఫలితాలు ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు అనుగుణంగా లేకపోవడంతో ఇన్వెస్టర్లు ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు, పవర్, యుటిలిటీస్, ఎనర్జీ, ఆయిల్ అండ్ గ్యాస్, క్యాపిటల్ గూడ్స్ షేర్లలో భారీగా లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. పలు ప్రభుత్వ రంగ షేర్లు పరిమితికి మించి పతనమవడంతో వాటిల్లో ట్రేడింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేయాల్సి వచ్చింది.
- సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 27 నష్టపోయాయి. ప్రభుత్వ రంగ ఎన్‌టీపీసీ షేరు 15 శాతానికి పైగా క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. ఎస్‌బీఐ, ఎల్ అండ్ టీ, పవర్‌గ్రిడ్ సైతం రెండంకెల స్థాయిలో నష్టపోయాయి. ఎఫ్ఎంసీజీ రంగ దిగ్గజం హెచ్‌యూఎల్ మాత్రం 6 శాతం లాభపడి సెన్సెక్స్ టాప్ గెయినర్‌గా నిలిచింది. నెస్లే ఇండియా 3 శాతానికి పైగా పెరిగింది.
- బీఎస్ఈలోని మిడ్‌క్యాప్ సూచీ 8.07 శాతం క్షీణించగా.. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 6.79 శాతం నష్టపోయింది. ఎఫ్ఎంసీజీ మినహా మిగతా రంగాల సూచీలన్నీ నేలచూపులు చూశాయి. యుటిలిటీస్ 14.40 శాతం, పవర్ 14.25 శాతం పతనమవగా.. ఆయిల్ అండ్ గ్యాస్ 13.07 శాతం, సర్వీసెస్ 12.65 శాతం, క్యాపిటల్ గూడ్స్ 12.06 శాతం, ఎనర్జీ 11.62 శాతం నష్టపోయాయి.
- బీఎస్ఈలో 3,934 కంపెనీల షేర్లు ట్రేడవగా.. 3,349 కంపెనీల స్టాక్ నష్టాలు చవిచూశాయి. 488 మాత్రం లాభపడ్డాయి. 97 యథాతథంగా ముగిశాయి. కాగా, 292 కంపెనీల షేర్లు ఏడాది కనిష్ఠ స్థాయికి పడిపోగా.. 139 ఏడాది గరిష్ఠాన్ని చేరాయి.
- ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 37 పైసలు క్షీణించి 83.51 వద్ద ముగిసింది. ఈక్విటీ మార్కెట్లో అమ్మకాలు పోటెత్తడంతో పాటు అంతర్జాతీయంగా డాలర్ బలపడటం ఇందుకు కారణమైంది.

**అదానీ షేర్లు ఢమాల్ :** నరేంద్ర మోదీకి అత్యంత సన్నిహిత కార్పొరేట్ ప్రముఖుడిగా పేరున్న గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ షేర్లు మహా పతనాన్ని చవిచూశాయి. ఇంట్రాడేలో అదానీ పోర్ట్స్ 25 శాతం వరకు క్షీణించింది. పలు కంపెనీల షేర్లు లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. దాంతో గ్రూప్‌లోని 10 లిస్టెడ్ కంపెనీల మార్కెట్ సంపద ఒక్కరోజులోనే రూ.3.64 లక్షల కోట్లు తగ్గి రూ.15.78 లక్షల కోట్లకు పడిపోయింది.

**పీఎస్‌యూ స్టాక్స్ పరేషాన్ :** ప్రభుత్వ రంగ సంస్థలు(పీఎస్‌యూ), ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల(పీఎస్‌బీ) షేర్లు భారీగా కుదేలయ్యాయి. ఆర్ఈసీ షేరు ఏకంగా 24.07 శాతం క్షీణించగా.. పీఎఫ్‌సీ 21.62 శాతం, కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 19.43 శాతం, భారత్ ఎలక్ట్రానిక్స్ 19.21 శాతం, ఓఎన్‌జీసీ 16.23 శాతం, కోల్ ఇండియా 13.54 శాతం, ఎన్‌టీపీసీ 14.52 శాతం నష్టపోయాయి. దాంతో నిఫ్టీ పీఎస్ఈ ఇండెక్స్ 16.38 శాతం పతనమై 9,475 స్థాయికి జారుకుంది. పీఎస్‌బీలదీ అదే పరిస్థితి. యూనియన్ బ్యాంక్ 17.65 శాతం, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ 15.15 శాతం చొప్పున నష్టపోయాయి. కెనరా బ్యాంక్ 13.45 శాతం, ఎస్‌బీఐ 13.37 శాతం తగ్గాయి. దాంతో నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 15.14 శాతం దిగజారి 6,794.25 వద్దకు పడిపోయింది. పీఎస్‌బీలతోపాటు ప్రైవేట్ బ్యాంక్‌లూ భారీ నష్టాలను చవిచూశాయి. దాంతో నిఫ్టీ బ్యాంక్ సూచీ 7.95 శాతం క్షీణించి 46,928.60 వద్దకు జారుకుంది.



**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 72,870 ▲ | 66,800 ▲ | 98,500 ▲ |
| ముంబై | 71,969 ▲ | 65,924 ▲ | 88,837 ▲ |

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**



| 5వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 480 | విజయవాడ | 450 |
| వరంగల్ | 482 | గోదావరి | 445 |
| చిత్తూరు | 563 | విశాఖపట్నం | 450 |
| | | డజను గుడ్లు రూ. 72 | |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 147 | విజయవాడ | 149 |
| వరంగల్ | 147 | గుంటూరు | 149 |
| కరీంనగర్ | 147 | ఒంగోలు | 149 |
| మహబూబ్‌నగర్ | 147 | చిత్తూరు | 142 |
| కర్నూలు | 147 | నెల్లూరు | 142 |
| విశాఖపట్నం | 135 | అనంతపురం | 149 |
| గోదావరి | 149 | | |




## పవన్‌కల్యాణ్‌కు సినీ ప్రముఖుల అభినందనలు

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమితో పొత్తు కుదుర్చుకున్న పవన్ కల్యాణ్.. పిఠాపురంలో ఎమ్మెల్యేగా గెలవడంతో పాటు జనసేన పార్టీ పోటీ చేసిన అన్ని స్థానాలలోనూ(21) జయకేతనం ఎగురవేశారు. ఈ నేపథ్యంలో పవన్‌కు పలువురు టాలీవుడ్ సెలబ్రిటీల నుంచి అభినందలు వెల్లువెత్తాయి. "ఎవ్వరికి అందదు అతని రేంజ్.. రెప్ప తెరిచేను రగిలే రివేంజ్" అని పేర్కొంటూ.. 'ఓజీ' టైమ్ బిగిన్స్ అనే ఓ సినిమా పోస్టర్‌ను నిర్మాణ సంస్థ డీవీవీ మూవీస్ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. "ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, హీరోలు బాలకృష్ణ, పవన్‌కల్యాణ్, బీజేపీ నాయకురాలు దగ్గుబాటి పురందేశ్వరికి హృదయపూర్వక అభినందనలు" అని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్మాతల మండలి పేర్కొంది. మరోవైపు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుకి మోహన్ బాబు శుభాకాంక్షలు తెలిపారు. "ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇంతటి ఘనవిజయం అందుకున్న నారా చంద్రబాబునాయుడుకు నా హృదయపూర్వక అభినందనలు. మీ పాలనలో రాష్ట్రం ప్రగతిపథంలో పయనిస్తుందని .. ఉన్నత శిఖరాలను చేరుకుంటుందని విశ్వసిస్తున్నాను" అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

**ఒక అన్నగా గర్వంగా ఉంది**



"డియర్ కల్యాణ్ బాబూ ..ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో తెలిసిన నిన్ను, తగ్గావని ఎవరు అనుకున్నా అది ప్రజలని గెలిపించటానికే అని నిరూపించిన నిన్ను చూస్తుంటే ఒక అన్నగా గర్వంగా వుంది. నువ్వు గేమ్‌చేంజర్‌వి మాత్రమే కాదు, 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'వి కూడా అని అందరూ నిన్ను కొనియాడుతుంటే నా హృదయం ఉప్పొంగుతోంది.
- చిరంజీవి

**హృదయపూర్వక శుభాకాంక్షలు**

చిరస్మరణీయమైన విజయం అందుకున్న పవన్ కల్యాణ్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు. ప్రజలకు నిరంతరం సేవ చేయాలన్న మీ కృషి, అంకితభావం, నిబద్ధత హృదయాన్ని హత్తుకునేలా ఉంటాయి. మీ కొత్త రాజకీయ ప్రయాణానికి అంతా మంచే జరగాలని కోరుకుంటున్నాను. - అల్లుఅర్జున్

**మీ గెలుపు స్ఫూర్తిదాయకం**

రీల్ లైఫ్‌లోనూ.. రియల్ లైఫ్‌లోనూ అసలు సిసలు హీరో అయిన పవన్ కల్యాణ్‌కు అభినందనలు. ఈ గెలుపు కోసం మీరు చేసిన పోరాటం ఎంతో స్ఫూర్తిదాయకంగా.. ఓ పాఠంలా ఉంది. మీరు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలి. - నాని

**చరిత్రను సృష్టించారు**

ఓ అభిమానిగా.. ఓ సోదరుడిగా నాకు ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది. ఎన్నికల్లో చరిత్రను సృష్టించారు. మీ సత్తాతో కూటమిని నిలబెట్టారు. ఈ విజయానికి మీరు అర్హులు. మీరెప్పటికీ మా పవర్‌స్టారే. - నితిన్

**తగిన ప్రతిఫలం దక్కింది**

శుభాకాంక్షలు పవన్ కల్యాణ్. మీ కృషికి, అంకితభావానికి తగిన ప్రతిఫలం దక్కింది. - కాజల్ అగర్వాల్

## ఓం బిర్లా రికార్డ్

**» స్పీకర్‌గా చేసి మళ్లీ ఎంపీగా ఎన్నిక**

న్యూఢిల్లీ, మే 4: లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన స్పీకర్ ఓం బిర్లా ఓ రికార్డ్ సాధించారు. స్పీకర్‌గా చేసి మళ్లీ లోక్‌సభకు ఎన్నికైన నేతగా నిలిచారు. గత 20 ఏళ్లలో ఈ ఘనత సాధించింది ఓం బిర్లానే. గతంలో కాంగ్రెస్‌కు చెందిన పీఏ సంగ్మా 1996లో లోక్‌సభ స్పీకర్‌గా చేసి, 1998లో మేఘాలయా రాష్ట్రంలోని తురా నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత ఈ ఫీట్ సాధించింది ఓం బిర్లానే. 1999లో ఏపీలోని అమలాపురం నుంచి టీడీపీ తరపున గెలిచిన జీఎంసీ బాలయోగి లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. అనంతరం 2002లో హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. బాలయోగి అనంతరం స్పీకర్‌గా ఎన్నికైన శివసేన నేత మనోహర్ జోషి.. 2004లో ముంబై నార్త్ సెంట్రల్ నియోజకవర్గం నుంచి పోటీచేసి.. కాంగ్రెస్ అభ్యర్థి ఏక్‌నాథ్ గైక్వాడ్ చేతిలో ఓడిపోయారు. 2004లో బోల్‌పూర్ నియోజకవర్గం నుంచి గెలిచిన సీపీఎం నేత సోమ్‌నాథ్ చటర్జీ లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. అనంతరం 2009లో సీపీఎంతో విభేదాలు రావడంతో ఆయన రాజకీయాల నుంచి నిష్క్రమించారు. 2009లో బిహార్‌లో ససరామ్ నియోజకవర్గం నుంచి గెలిచిన కాంగ్రెస్ సభ్యురాలు మీరా కుమార్ 15వ లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆమె ఓడిపోయారు. 2014లో స్పీకర్‌గా ఎన్నికైన బీజేపీ నాయకురాలు సుమిత్రా మహాజన్.. 2019 ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఆ తర్వాత 2019లో స్పీకర్‌గా ఎన్నికైన ఓం బిర్లా.. ఇప్పుడు మళ్లీ ఎంపీగా గెలిచి రికార్డు సృష్టించారు.

# ఇండియా కొంప ముంచిన స్నేహపూర్వక పోటీ!

## లేకుంటే కాంగ్రెస్ ఖాతాలో మరికొన్ని సీట్లు

- » ఉమ్మడి అభ్యర్థులున్న చోట ఘన విజయం
- » హిందీబెల్ట్‌లో ఫలించిన కాంగ్రెస్ వ్యూహం
- » మిత్రుల పోటీతో పంజాబ్, బెంగాల్‌లో నష్టం


సురేశ్ గోపి

"బీజేపీని దెబ్బతీయాలంటే.. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టాలి. మనలో మనం పోటీ పడకూడదు.." గత ఏడాది జూలై 17న బెంగళూరులో జరిగిన ఇండియా కూటమి(40 పార్టీలు) సమావేశంలో సూత్రప్రాయంగా తీసుకున్న నిర్ణయం ఇది..! ఆ తర్వాత ఆగస్టు 31, సెప్టెంబరు 1 తేదీల్లో ముంబైలో జరిగిన సమావేశంలోనూ ఇదే అంశంపై చర్చ జరిగింది..! క్షేత్రస్థాయిలో మాత్రం కొన్ని రాష్ట్రాల్లో ఇది సాధ్యం కాలేదు. 'స్నేహపూర్వక పోటీ'ని కూటమి పక్షాలు ప్రకటించుకున్నాయి. ఇప్పుడు ఆ స్నేహపూర్వక పోటీలే కూటమి కొంప ముంచాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### మిత్రుల మధ్య పోటీతో నష్టం

ఇండియా కూటమిలోని వంచిత్ బహుజన్ అఘాడీ వంటి పలు చిన్న పార్టీలు కొన్ని చోట్ల కాంగ్రెస్‌పై తమ అభ్యర్థులను నిలిపాయి. వీటి ద్వారా కొంత మేర నష్టం జరగ్గా.. కేరళ, పశ్చిమబెంగాల్, పంజాబ్‌లలో మాత్రం పూడ్చలేని నష్టం వాటిల్లింది. 'ఉమ్మడి అభ్యర్థి' నిబంధనకు కట్టుబడి ఉంటే.. కాంగ్రెస్ కూటమికి ఈ మూడు రాష్ట్రాల్లో అదనంగా 11-16 సీట్లు వచ్చి ఉండేవని తాజా ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ స్నేహపూర్వక పోటీ పంజాబ్‌లో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు విజయాన్ని కట్టబెట్టింది. ఖదూర్‌సాహి నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థికి 3.76 లక్షల ఓట్లు రాగా.. అక్కడి ఆప్-కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లు మొత్తం 5.25 లక్షలకు పైనే..! ఫరీద్‌కోటాలో కూడా 2.96 లక్షలతో ఇండిపెండెంట్ అభ్యర్థి అగ్రస్థానంలో నిలవగా.. అక్కడ కాంగ్రెస్, ఆప్‌కు వచ్చిన ఓట్ల మొత్తం 3.8 లక్షలు. బఠిండాలో శిరోమణి అకాలీదళ్ 3.75లక్షలతో విజయం సాధించగా.. అక్కడ కూడా ఆప్-కాంగ్రెస్‌లకు వచ్చిన ఓట్ల సంఖ్య 5.25 లక్షలు. పశ్చిమ బెంగాల్‌లో ఇండియా కూటమిలోని టీఎంసీ, కాంగ్రెస్, సీపీఎం పరస్పర పోటీ వల్ల 8-10 సీట్లలో బీజేపీ పాగా వేసింది. ఇక్కడ కూడా బీజేపీ అభ్యర్థులకు వచ్చిన ఓట్లతో పోలిస్తే.. విడివిడిగా కూటమికి వచ్చిన ఓట్ల సంఖ్య చాలా ఎక్కువ కావడం గమనార్హం..! కేరళలోని త్రిషూర్ నియోజకవర్గం నుంచి నటుడు, బీజేపీ అభ్యర్థి సురేశ్‌గోపీ ఘనవిజయం సాధించారు. అక్కడ కమ్యూనిస్టులకు, కాంగ్రెస్‌కు వచ్చిన మొత్తం ఓట్ల కంటే.. సురేశ్‌గోపీ సాధించిన ఓట్లు దాదాపు 2.06 లక్షల మేర తక్కువ కావడం గమనార్హం. కేరళలో కాంగ్రెస్ గెలిచిన స్థానాల్లో చాలా వరకు కమ్యూనిస్టులే రెండో స్థానంలో ఉన్నారు. అక్కడ విడివిడిగా పోటీచేయకుండా ఉండిఉంటే.. భారీ మెజారిటీ వచ్చేదనేది నిర్వివాదాంశం.

### ఆ రాష్ట్రాల్లో గ్రాండ్ సక్సెస్..!

ప్రీపోల్ సర్వేలు మొదలు.. ఎగ్జిట్ పోల్స్ దాకా ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ హవా అంటూ ఫలితాలొచ్చాయి. మంగళవారం నాటి ఫలితాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. 80 స్థానాలున్న యూపీలో ఇండియా కూటమిదే పైచేయి అయ్యింది. 2014లో 77, 2019లో 62 సీట్లను సాధించిన బీజేపీ ఈ సారి 33 స్థానాలకే పరిమితమైంది. ఇందుక్కారణం.. 'ఉమ్మడి అభ్యర్థి' నిబంధనకు కట్టుబడి ఉండడమే..! బీజేపీ అధికారంలో ఉన్న యూపీలో ఈ ప్రయోగంతో గ్రాండ్ సక్సెస్ అయినట్లే. అంతే కాదు.. మహా వికాస్ అఘాడీ పేరుతో ముందు నుంచి కూటమిగా ఉన్న కాంగ్రెస్, ఎన్సీపీ(శరద్ వర్గం), శివసేన(ఉద్ధవ్ వర్గం) 48 లోక్‌సభ స్థానాలున్న మహారాష్ట్రలోనూ 'ఉమ్మడి' ధర్మాన్ని పాటించాయి. ఫలితంగా 29 స్థానాల్లో ఘనవిజయం సాధించాయి. రాజస్థాన్, ఝార్ఖండ్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లోనూ ఈ ప్రయోగం ఫలించింది. హిందీబెల్ట్‌లో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, ఉత్తరాఖండ్ మినహా.. ఇండియా కూటమి మంచి ఫలితాలను సాధించింది. గత ఎన్నికల్లో ఈ బెల్ట్‌లో బీజేపీ ఏకపక్ష హవా కొనసాగిన విషయం తెలిసిందే..!

- సెంట్రల్ డెస్క్

**భారీగా పుంజుకున్న కాంగ్రెస్**

*2014, 2019 ఎన్నికలతో పోలిస్తే.. కాంగ్రెస్ ఈసారి పుంజుకుంది. తాజా ఎన్నికల్లో ఆ పార్టీ ఒంటరిగా 99 స్థానాల్లో విజయం సాధించింది. నిజానికి 2014లో 44 సీట్లు.. 2019లో 52 స్థానాలను మాత్రమే సాధించిన కాంగ్రెస్.. లోక్‌సభలో విపక్ష పార్టీ హోదాను కూడా దక్కించుకోలేదు. ఓ దశలో బీజేపీ దూకుడుతో క్రమంగా కాంగ్రెస్ కనుమరుగవుతోందా? అనే అనుమానాలు రాజకీయవర్గాల నుంచి వ్యక్తమైన నేపథ్యంలో.. రాహుల్‌గాంధీ రెండుసార్లు చేపట్టిన 'భారత్ జోడో యాత్ర'లు ప్రజల్లో మళ్లీ ఆదరణను తెచ్చిపెట్టాయి. ముఖ్యంగా దక్షిణాదిన కేరళలో తిరిగి తన సత్తాను చాటుకోగా.. హిందీబెల్ట్‌లో ఆశించిన స్థాయిలో పురోగతిని నమోదు చేసుకుంది. వచ్చే ఎన్నికల్లోగా ఆ పార్టీ మరింత వేగంగా పుంజుకుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.*

# లోక్‌సభకు రామాయణ్ రాముడు.. రచన.. కంగన..

## ఎన్నికల్లో వివిధ పార్టీల తరపున మెరిసిన తారలు





న్యూఢిల్లీ, జూన్ 4: లోక్‌సభ ఎన్నికల్లో తారలు తళుక్కుమన్నారు. రామానంద్ సాగర్ రామాయణ్‌లో శ్రీరాముడి పాత్రధారి, బాలీవుడ్ నటుడు అరుణ్ గోవిల్ తొలిసారిగా చట్టసభలో అడుగుపెట్టనున్నారు. యూపీలోని మేరఠ్ నుంచి పోటీచేసిన ఆయన ఎస్పీ అభ్యర్థి సునీతా వర్మపై 9,366 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రముఖ సినీనటి, తెలుగులో 'కన్యాదానం', 'మావిడాకులు', 'నేను ప్రేమిస్తున్నాను' వంటి చిత్రాల్లో నటించిన రచనా బెనర్జీ టీఎంసీ తరఫున విజయం సాధించారు. బెంగాల్‌లోని హుగ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆమె 74,048 ఆధిక్యాన్ని సాధించారు. బెంగాల్‌లోని జాదవ్‌పూర్ నుంచి టీఎంసీ నుంచే బరిలో నిలిచిన బెంగాలీ సినిమా, టీవీ నటి సయానీ ఘోష్ 2.50 లక్షల ఓట్ల ఆధిక్యంతో బీజేపీ అభ్యర్థిపై గెలుపొందారు. ఇప్పటికే ఓసారి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించిన ప్రముఖ మలయాళీ నటుడు సురేశ్ గోపీ కేరళలోని త్రిషూర్‌లో విజయం సాధించి, లోక్‌సభలో అడుగుపెట్టనున్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి స్థానం నుంచి బీజేపీ నుంచి రేసులో నిలిచిన బాలీవుడ్ నటి కంగనా రనౌత్ 74,755 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈశాన్య ఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసిన భోజ్‌పూరి నటుడు మనోజ్ తివారీ సమీప కాంగ్రెస్ ప్రత్యర్థి కన్హయ్య కుమార్‌పై 1,22,135 ఓట్ల ఆధిక్యాన్ని సాధించారు. బెంగాల్‌లోని అసన్సోల్ స్థానం నుంచి పోటీ చేసిన సిటింగ్ ఎంపీ, ఈసారి కాంగ్రెస్ తరఫున పోటీచేసిన బాలీవుడ్ సీనియర్ నటుడు శతృఘ్న సిన్హా, బీజేపీ అభ్యర్థి సురేంద్రజీత్‌పై విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి హేమామాలిని యూపీలోని మథుర స్థానం నుంచి 2.91లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ప్రముఖ నటుడు, యూపీలోని గోరఖ్‌పూర్ సిటింగ్ ఎంపీ, రేసుగుర్రం సినిమాలో ప్రతినాయకుడు రవికిషన్(రవీంద్ర శుక్లా).. ఎస్పీ అభ్యర్థి కాజల్ నిషాద్‌పై లక్ష పైచిలుకు ఓట్లతో గెలుపొందారు. బెంగాల్‌లోని ఘటల్ నుంచి పోటీ చేసిన తృణమూల్ సిటింగ్ ఎంపీ, సినీనటుడు దీపక్ అధికారి బీజేపీ అభ్యర్థి హిరణ్మయి చటోపాధ్యాయపై 1.75 లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అయితే భోజ్‌పురీ నటుడు, నేపథ్య గాయకుడు పవన్ సింగ్‌కు బిహార్‌లోని కరాకట్ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి, ఓటమిపాలయ్యారు. యూపీలోని ఆజంఘడ్ నుంచి భోజ్‌పురీ నటుడు దినేశ్ లాల్ యాదవ్ ఎస్పీ అభ్యర్థి ధర్మేంద్రయాదవ్ చేతిలో 1.6 లక్షల ఓట్ల తేడాతో ఓడిపోయారు. టీవీ నటిగా, మోడల్‌గా గుర్తింపు పొంది రాజకీయాల్లోకి అడుగుపెట్టిన స్మృతీ ఇరానీ.. అమేఠీ నుంచి పోటీ చేసి, కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో 1.62 లక్షల ఓట్లతో ఓడిపోయారు. తమిళనాడులోని విరుద్‌నగర్ నుంచి బీజేపీ తరఫున పోటీచేసిన నటి రాధిక, అమరావతి నుంచి పోటీ చేసిన నవనీత్‌కౌర్ ఓడిపోయారు.

## సందేశ్‌ఖాలీలో బీజేపీ ఓటమి

కోల్‌కతా, మే 4: సందేశ్‌ఖాలీ.. గత కొన్ని రోజులుగా వార్తల్లో విపరీతంగా వైరల్ అయిన స్థానం.. బెంగాల్ బీజేపీ నేతలు ఎక్కువగా ప్రస్తావించిన పేరిది.. ఈ నియోజకవర్గానికి చెందిన ఓ మహిళను టీఎంసీ నాయకులు లైంగికంగా వేధించారంటూ బీజేపీ పలు ఆందోళనలు చేసింది. కానీ, ఇవేవీ లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి ఓట్లను రాల్చలేదు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన బశీర్‌హాట్ లోక్‌సభ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో సందేశ్‌ఖాలీ కూడా ఒకటి. ఈ నియోజకవర్గంలో బీజేపీ దారుణ పరాజయాన్ని చవిచూసింది. బీజేపీ అభ్యర్థి రేఖా పాత్రను టీఎంసీ అభ్యర్థి, ఆ పార్టీ సీనియర్ నాయకుడు హాజీ నూరుల్ ఇస్లాం దాదాపు రెండు లక్షల ఓట్ల తేడాతో ఓడించారు. ఈ సందర్భంగా హాజీ నూరుల్ ఇస్లాం మాట్లాడుతూ.. "నా విజయంతో సందేశ్‌ఖాలీ గురించి ప్రచారం చేసినవన్నీ అబద్ధాలేనని తేలిపోయింది. ప్రజలెవరూ వాటిని నమ్మలేదు. వైరల్ చేసిన వీడియోల వెనుక బీజేపీ పాత్ర ఉందని వారు భావించారు. అందుకే బీజేపీ పన్నిన కుట్రకు నా విజయంతో చక్కటి సమాధానం చెప్పారు" అని అన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఉత్కంఠకు, ఆకాంక్షలకు తగ్గట్టుగానే, ఎన్నికల ఫలితాలు సంభ్రమాశ్చర్యాలు కలిగించాయి. ఉక్కుపాదాల నుంచి, ఉక్కపోతల నుంచి, దుష్పరిపాలనల నుంచి ఉపశమనం కలిగించాయి. ఆగ్రహానికి, నిరాదరణకు పాత్రులైన నాయకులను, వారి ప్రభుత్వాలను నిర్దాక్షిణ్యంగా ప్రజారంగం నుంచి నెట్టివేశాయి. తిరుగులేని, ఎదురులేని నాయకులనుకున్న వారి ఒడ్డూపొడుపూ కత్తిరించి బుద్ధి చెప్పాయి. 2024 ప్రజల తీర్పు భారత రాజకీయరంగాన్ని తిరిగి సంచలనశీలంగా మార్చింది. పదేళ్ల ఏకపక్ష పాలన స్థానంలో తిరిగి సంకీర్ణ రాజకీయాలను ప్రవేశపెట్టింది. జాతీయ రంగస్థలం మీద తెలుగువారి ప్రమేయానికి పట్టం కట్టింది.

భారతీయ జనతాపార్టీకి మెజారిటీ బహుదూరంలోనే నిలిచిపోయింది. ఎన్‌డీఏలోని భాగస్వామ్యపక్షాల సహకారంతో మాత్రమే తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలదు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించి సాగనంపారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి కనీవినీ ఎరుగని ఘనవిజయం సాధించింది. కేంద్రంలోని కొత్త ప్రభుత్వంలో తెలుగుదేశం, ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు కీలకపాత్ర పోషించనున్నారు. తెలంగాణలో అధికార కాంగ్రెస్‌కు నిరుత్సాహకరమైన ఫలితాలు వచ్చాయి. గత లోక్‌సభలో నాలుగు స్థానాలు పొందిన తెలంగాణ బీజేపీ తన బలాన్ని రెట్టింపు చేసుకుంది. గత సభలో మూడు స్థానాల బలమే ఉన్నప్పటికీ, ఇటీవల రాష్ట్రంలో అధికారం పొందినందున, మెరుగైన ఫలితాలు సాధించవలసిన కాంగ్రెస్ తన సంఖ్యను ఎనిమిదికి మించి పెంచుకోలేకపోయింది.

వైసీపీ ప్రభుత్వం ఘోరపరాజయం పూర్తిగా స్వయంకృతం. ప్రత్యర్థులు ఎన్నికల ప్రచారంలో ఏకరువు పెట్టిన జగన్ ప్రభుత్వ దుర్మార్గాలకంటే, ప్రజల అనుభవంలోకి వచ్చినవి కొన్ని రెట్లు ఎక్కువ అని ఈ ఫలితాలు చెబుతున్నాయి. వైసీపీ ని అనేక జిల్లాలనుంచి ఏకమొత్తంగానూ తుడిచి పెట్టారంటే, దుష్పరిపాలన తీవ్రత ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. రెండంకెల సంఖ్యకు కూడా చేరుకోలేక కునారిల్లుతూ, ప్రతిపక్ష స్థాయి కూడా దక్కనంత స్వల్పమైన ఉనికి మిగిలిన ఆ పార్టీ తన దుస్థితికి కారణాలను సమీక్షించుకుని సుదీర్ఘ కాలం నిరీక్షించవలసిందే.

కూటమి 21 లోక్‌సభ స్థానాలను సాధించగా, అందులో తెలుగుదేశం సొంతంగా 16 స్థానాలు సంపాదించింది. కేంద్రంలో మెజారిటీ కొరవడిన బీజేపీకి టీడీపీ ఇప్పుడు అత్యంత అవసరమైన, కీలకమయిన భాగస్వామి. బీజేపీ తరువాత అత్యధిక స్థానాలు సాధించిన ఎన్‌డీఏ భాగస్వామి తెలుగుదేశమే. గత రెండు పదవీకాలాల్లో కూడా పేరుకు ఎన్‌డీఏ ప్రభుత్వమే అయినా, తనకు సొంతంగా మెజారిటీ ఉన్నందున నామమాత్రపు సంకీర్ణంగా మాత్రమే వ్యవహరించిన బీజేపీ, ఈసారి అనివార్యంగా భాగస్వామిక రాజకీయాలను అంగీకరించవలసి వస్తుంది. తెలుగుదేశంపార్టీకి, బిహార్‌కు చెందిన జనతాదళ్ యునైటెడ్‌కు వాస్తవ అర్థంలో తగినప్రాధాన్యం విధిగా ఇవ్వవలసి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి విషయంలో అలక్ష్యం చూపుతున్నందుకు, బీజేపీ ఇతర విధానాలపై నిరసనగాను గతంలో ఎన్‌డీఏ ప్రభుత్వం నుంచి వెలుపలికి వచ్చిన తెలుగుదేశం పార్టీకి, ప్రస్తుత విజయాలు మంచి సానుకూలతను సమకూర్చాయి. రాజధాని, పోలవరం వంటి అభివృద్ధి అంశాల మీద కేంద్రం నుంచి తగిన స్పందనను రాబట్టగలిగే శక్తి టీడీపీకి ఇప్పుడున్నది. చంద్రబాబు నాయుడుకు ఉన్న అపారమైన అనుభవం, కార్యదక్షత వల్ల జాతీయ రంగంలో కూడా ఆయన క్రియాశీల బాధ్యతలు నిర్వహించగలరని, బీజేపీ ప్రభుత్వం దూకుడుకు కళ్లెం వేయగలిగేది కూడా చంద్రబాబేనని ఆశాభావాలు వ్యక్తమవుతున్నాయి.

బీజేపీ ఎనిమిది విజయాలను, బీఆర్ఎస్ సున్నా స్కోర్‌తో కలిపి చూస్తేనే తెలంగాణ ఫలితాలు అర్థమవుతాయి. గత ఏడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పరాజిత బీఆర్ఎస్‌కు వచ్చిన సుమారు 37 శాతం ఓట్లు పార్లమెంటు ఎన్నికలలో ఎవరికి మళ్లుతాయన్న చర్చ జరుగుతూ వచ్చింది. గణనీయభాగం బీజేపీకి పోయినట్టు అర్థమవుతోంది. కేంద్రంలో మహాబలంతో బీజేపీ ప్రభుత్వం ఉండి ఉంటే, ఈ గెలుపులు

## పదును చూపిన ప్రజల విజ్ఞత



రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఇబ్బందులు కలిగించి ఉండేవి. ఇప్పుడు, పరిమిత బలం కలిగిన కేంద్రమే ఉంటుంది కాబట్టి, తక్షణ ప్రమాదం లేదు కానీ, పరిస్థితిని మెరుగుపరుచుకోకపోతే కాంగ్రెస్‌కు, బీఆర్ఎస్‌కు కూడా ఇబ్బందులే ఎదురవుతాయి.

తెలుగు రాష్ట్రాల పరిణామాలకు మించిన ప్రాధాన్యం కలిగినవి, దేశ రాజకీయాల గతినే మార్చగలిగేవి పదిహేడో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు. తెలంగాణలో బీజేపీ, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ఘనవిజయం సాధించాయి కానీ, జాతీయస్థాయిలో బీజేపీకి తీవ్రమైన ఎదురుదెబ్బలు తగిలాయి. ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలలో ఆ పార్టీ కొత్తగా అధికారంలోకి రాగలుగుతోంది, మధ్యప్రదేశ్, గుజరాత్, ఒడిశా, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలోనూ ఘనవిజయాలు సాధించింది. కేరళ వంటి రాష్ట్రంలో ఒక స్థానం గెలవగలిగింది. ఈ విజయాలన్నిటి కంటె, మెజారిటీ ఎదురైన కొరతే బీజేపీకి అతి పెద్ద నష్టం. గత లోక్‌సభలో 303 స్థానాల బలమున్న బీజేపీ, కొత్త లోక్‌సభలో 240 దరిదాపుల్లో సంతృప్తిపడవలసి వచ్చింది. మైనారిటీ ప్రభుత్వాన్ని నడపడం బీజేపీకి కొత్త కాదు. 1999 ఎన్నికలలో బీజేపీ 182 స్థానాలు మాత్రమే గెలుచుకుంది. అయినా మిత్రపక్షాలతో కలిసి ఒకటో ఎన్‌డీఏ ప్రభుత్వం నడిపింది. కానీ, 2014లో 282, 2019లో 303 స్థానాలను గెలుచుకుని సంకీర్ణ ప్రభుత్వాల పేరుతో తన సొంత ప్రభుత్వాలనే నడిపింది. ఈ సారి, సొంతంగా 370 స్థానాలు గెలవాలని, మిత్రులతో కలసి 400 గెలవాలని ఆశించింది. అవి కేవలం సంఖ్యలు కావు. మూడింట రెండు స్థానాల మెజారిటీ కోసం 370, కాంగ్రెస్ 1984 రికార్డును అధిగమించడం కోసం 400 అంకెలను ఎంచుకున్నారు. అధిక మెజారిటీ కోరుకున్నది రాజ్యాంగ సవరణలకు వెసులుబాటు కోసమే కావచ్చు. ప్రతిపక్ష 'ఇండియా' కూటమికి అదే ఆయుధంగా మారింది. రాజ్యాంగాన్ని మార్చబోతున్నారని, రాజ్యాంగం అట్టడుగు వర్గాలకు కల్పించిన ప్రత్యేక రక్షణలను తొలగించబోతున్నారని ప్రతిపక్షం చేసిన ఆరోపణ ఓటర్ల మీద తీవ్రంగా ప్రభావం చూపినట్టు, సామాజికవర్గాల వారీ ఓటింగ్ శాతాలు సూచిస్తున్నాయి.

పదిహేనేళ్ల తరువాత కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని దాదాపు రెట్టింపు చేసుకోగలగడానికి ఆ పార్టీ మిత్రపక్షాలతో చూపించిన సర్దుబాటు వైఖరి, రాహుల్ జోడో యాత్రలు, విస్పష్టమైన విధానాలతో వైఖరుల రూపకల్పన ముఖ్యమైన కారణాలు. బీజేపీ విస్తరణను అడ్డుకోగలిగిన మమతా బెనర్జీ, అఖిలేశ్ యాదవ్, శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రేలను ప్రధానంగా చెప్పుకోవాలి. ప్రతిపక్ష పార్టీలను, మాజీ మిత్రపక్షాలను చీలికల ద్వారా బలహీనపరచాలనే ఆలోచనను ప్రజలు సమ్మతించరని మహారాష్ట్ర నిరూపించింది. ద్రవిడ వాదానికి తాను పెట్టనికోటనని తమిళనాడు మరోసారి నిరూపించుకుంది. దేశంలోని ఈ నాయక బాహుళ్యం ఎక్కడికక్కడ ఆత్మరక్షణ చేసుకోవడంతో పాటు, అవాంఛనీయమైన అధిక మెజారిటీలను నిరోధించగలిగింది. పాపం, నవీన్ పట్నాయక్ బీజేపీని సొంతంగా ఢీకొని, నష్టపోయారు.

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటికి, బీజేపీ ఘనవిజయమే ఖాయమన్న అభిప్రాయం దేశంలో నెలకొని ఉన్నది. అధికారపక్షం తగిన రాజకీయ నినాదాలతో సర్వసన్నద్ధంగా ఉన్నట్టు కనిపించింది. మొదటి రెండు దశల ప్రచారంలో సాధారణ అంశాలే వినిపించగా, మూడోదశనుంచి ప్రధాని మాటలో తీవ్రత, విభజనవాదం పెరిగాయి. ప్రధానిహోదాను కూడా ఖాతరు చేయకుండా, ఊహించని రీతిలో నరేంద్రమోదీ మాట్లాడసాగారు. ఆయన అట్లా మాట్లాడడానికి, ఓటర్లలో కనిపిస్తున్న అనాసక్తి కారణమన్న విశ్లేషణలు మొదలయ్యాయి. తక్కిన అన్నిదశలలోను, చివరి రోజుతో సహా, నరేంద్రమోదీ వివాదాస్పదమైన అంశాలే మాట్లాడుతూ వచ్చారు. మోదీ రాజ్యాంగాన్ని మార్చాలనుకుంటున్నారని ఇండియా కూటమి, కాంగ్రెస్ కూటమి బీసీ, ఎస్సీల రిజర్వేషన్లు తగ్గించి ముస్లిములను ఇవ్వాలనుకుంటున్నదని మోదీ పరస్పర ఆరోపణలు సంధించుకున్నారు. మోదీ విభజన వాదానికి పెద్దగా ఆమోదం లభించలేదని ఫలితాలు సూచిస్తున్నాయి. అంతేకాదు, రామమందిర ప్రతిష్ఠను, రాజకీయాలను ప్రజలు వేరువేరుగానే పరిగణించారని తెలుస్తోంది. అయోధ్య (ఫైజాబాద్) స్థానంలో బీజేపీ ఓడిపోయిందంటే అర్థం ఏమిటి?

ఉమ్మడి పౌరస్మృతి, రాజ్యాంగం నుంచి సెక్యులర్ పదం తొలగింపు, ఒకే దేశం–ఒకే ఎన్నిక, నియోజకవర్గాల పునర్విభజన, జీఎస్టీ పరిధిలోకి పెట్రో ఉత్పత్తులు వంటి అనేక అంశాలు బీజేపీ ఎజెండాలో ఉన్నాయి. ఈ అంశాలపై ప్రతిపక్షాలకు, ప్రాంతీయ పార్టీలకు భిన్నాభిప్రాయాలు, సొంత ప్రతిపాదనలు ఉన్నాయి. వీటికి సొంతంగా అధిక మెజారిటీ కావాలి, రాష్ట్రాలలో కూడా సొంతప్రభుత్వాలు ఉండాలి. ప్రాంతీయ పార్టీలను సాధ్యమైనంతగా అప్రధానం, బలహీనం చేయాలన్నది మోదీ నాయకత్వంలోని బీజేపీ ఆశయం. తమ ప్రభుత్వాలు ఉన్నచోట తప్ప, ఇతర ప్రభుత్వాలు ఉన్న చోట, ముఖ్యంగా ప్రాంతీయపార్టీలు ఉన్న ప్రభుత్వాలు ఉన్నచోట నిధుల పంపకంలో గానీ, గవర్నర్‌ల జోక్యంతో కానీ ఇబ్బందులు కల్పించడం గత పదేళ్లుగా చూస్తూ ఉన్నదే. అయితే, అనుకున్నంత బలం సమకూరదేమోనన్న భయం ఏ మూలో ఉండడంతో బీజేపీ ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయపార్టీలతో కూటమిలోకి వచ్చింది.

ఎవరిమీదా ఆధారపడనక్కరలేని స్థితిలో, కేంద్రప్రభుత్వ దర్యాప్తు ఏజెన్సీలను ప్రతిపక్షాల మీద ప్రయోగించడానికి, రాజకీయనేతలను జైళ్లలో పెట్టడానికి బీజేపీ ప్రభుత్వానికి వెసులుబాటు లభించింది. రాష్ట్రాల అధికారాలను కుదించే అనేక నిర్ణయాలను కూడా గత పదేళ్లలో యథేచ్ఛగా తీసుకోగలిగారు. సంకీర్ణ ప్రభుత్వాలను నడిపేవారు ఏకాభిప్రాయ సాధనలో నిమగ్నం కావలసి ఉంటుంది. అందుకు వాజపేయి, మన్మోహన్ సింగ్‌కు ఉన్నటువంటి మృదు స్వభావం అవసరం. నరేంద్ర మోదీ తానే మూడోసారి ప్రధాని కాదలచుకున్నట్టు, మంగళవారం సాయంత్రం ఢిల్లీలో పార్టీ కార్యక్రమంలో ఇచ్చిన సందేశం సూచిస్తోంది. ప్రస్తుత విజయాన్ని ఎన్డీఏ విజయంగానే చెబుతున్నారు, రాబోయే ప్రభుత్వాన్ని ఎన్‌డీఏ ప్రభుత్వంగానే సంబోధించారు. అవినీతిపై చండశాసనంలో తగ్గేదే లేదని, వికసిత్ భారత్ లక్ష్యాల సాధనలో ముందుకే వెడతామని ఆయన గట్టిగా చెప్పారు. 2019 నాటి సంబరాలతో పోల్చినప్పుడు, ఇప్పటి పార్టీ కార్యక్రమం నీరసంగానే కనిపించింది.

లోక్‌సభ ఫలితాలు మోదీ పరాజయాన్నే సూచిస్తున్నాయని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అన్నారు. బీజేపీ ఎన్నికల ప్రచారం అంతా మోదీ వ్యక్తి ప్రతిష్ఠచుట్టూ జరిగినందున, మెజారిటీ పొందలేకపోవడం మోదీ వ్యక్తిగత అపజయంగా పరిగణించడంలో తప్పేమీ లేదు. మోదీ, అమిత్ షా ఇద్దరే మొత్తం పరిపాలనాచక్రాన్ని, రాజకీయచక్రాన్ని ఇంత కాలం తిప్పుతూ వచ్చినందున, సంప్రదింపులు, సమన్వయం అవసరమైన నూతన ప్రభుత్వాన్ని వారు సౌకర్యంగా నిర్వహించగలరా అన్న అనుమానం రావడం సహజం. తాను తప్పుకుంటానని మోదీ పార్టీ ముఖ్యుల ముందు ప్రస్తావించారేమో తెలియదు కానీ, ప్రస్తుతానికి పాత నాయకద్వయమే అగ్రపీఠాలపై కొనసాగుతారనిపిస్తోంది.

ఇండియా కూటమి నుంచి చంద్రబాబు నాయుడుకు, నితిశ్ కుమార్‌కు సూచనలు వెళ్లాయని చెబుతున్నారు కానీ, వారు అందుకు అంగీకరించే అవకాశం లేదు. ఈ తరుణంలో వారు తమ భాగస్వాములను మార్చుకోవడం నైతికం కాదు. కాకపోతే, ప్రజాస్వామిక సంప్రదాయాలను అనుసరించేట్టు, విభేదించేవారితోనూ విపక్షాలతోనూ వేధింపు ధోరణిలో వ్యవహరించకుండా బీజేపీని మిత్రపక్షాలు కట్టడి చేయగలిగితే బాగుండునని ప్రజాస్వామికవాదులు ఆశిస్తున్నారు.

ఈ ఎన్నికలు నిరూపించిన మరొక ముఖ్యమైన అంశం, మతం పేరుతో, జాతీయత పేరుతో ఎంతటి ఉద్వేగాలను వ్యాపింపజేసినా, అవి దైనందిన జీవన సమస్యల నుంచి ప్రజలను ఎంతోకాలం దృష్టి మళ్లించలేవు. ఈ ఎన్నికలఫలితాలు గ్రామీణ భారతంలోని సంక్షోభపరిస్థితులను సూచిస్తున్నాయని, ప్రజలు స్పష్టంగా ఒక సంకేతం పంపించారని విశ్లేషకులు చెబుతున్నారు.


ప్రజాప్రతినిధుల అరాచక హింసోన్మాదాన్ని, అవినీతిని ఓటు ఆయుధంతో తిప్పి కొట్టిన ఆంధ్రప్రదేశ్ ప్రజలు, తమ కొత్త ప్రభుత్వం ద్వారా విభజనానంతర సమస్యల పరిష్కరించుకుంటారని, అన్ని హంగుల రాజధానితో సహా అభివృద్ధి ఆకాంక్షలన్నిటిని సాధించుకుంటారని ఆశిద్దాం. •

## బాబు నాయకత్వానికి, కూటమి దక్షతకు పట్టం

చంద్రబాబు పాలనలో 2014–19 మధ్య అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాలు లబ్ధిపొందాయి. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం సమపాళ్ళలో జరిగింది. ప్రజాస్వామ్యయుతంగా పాలన నడిచింది. 2019–24 మధ్య జగన్ పాలన చంద్రబాబు పాలనకు పూర్తి విరుద్ధంగా నడిచింది. ఆ తేడాను ప్రజలు అనుభవపూర్వకంగా అర్థం చేసుకున్నారు. జగన్‌ను గెలిపించి మోసపోయామని ప్రజలు బాధపడుతున్న సమయంలో అక్రమ కేసులతో చంద్రబాబును 53 రోజులు జైల్లో నిర్బంధించారు. భువనేశ్వరిని శాసనసభలో అవమానపరచడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. లోకేష్ ప్రజాగళాన్ని అడ్డుకోవడం, పవన్‌కళ్యాణ్ వ్యక్తిత్వంపై దాడి చేయడం ప్రజలకు కోపాగ్ని రగిల్చింది. అంతిమ నిర్ణేతలు ప్రజలేగాని నిర్బంధాలు, మద్యం పీపాలు కాదని ఈ ఎన్నికలు రుజువు చేశాయి.

ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో ఇది అతిపెద్ద ప్రజా తీర్పు. జగన్‌కు ప్రతిపక్ష హోదాను కూడా ప్రజలు ఇవ్వలేదు. విధ్వంసం నుండి రాష్ట్రాన్ని చంద్రబాబు పాలన మాత్రమే గట్టెక్కించగలదని ప్రజలు భావించి ఇచ్చిన తీర్పు ఇది. మోసపోయిన పేదలు ఇచ్చిన తీర్పు. భవిత కోసం యువత ఇచ్చిన తీర్పు. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఇచ్చిన తీర్పు. తమ ఆస్తులు, ప్రాణాలు కాపాడుకోవడానికి సకల జనులు ఇచ్చిన తీర్పు. ప్రజాస్వామ్య పరిరక్షణకు మేధావులు ఇచ్చిన తీర్పు. మోదీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ నాయకత్వాలకు ప్రజలు పట్టం కట్టిన తీర్పు.

ఈ అధికారం చంద్రబాబుకు పూలబాట కాదు. రూ. 13 లక్షల కోట్లు అప్పుతో ఏడాదికి రూ.50 వేల కోట్ల వడ్డీ, అసలు వాయిదాల చెల్లింపు భారం మోయాల్సి వుంది. వివిధ వర్గాలకు జగన్ పెట్టిన బకాయిలు రూ.2 లక్షల కోట్ల చెల్లింపులు చేయాల్సి వుంది. మేనిఫెస్టో హామీలు అమలు చేయాలి. పోలవరం పూర్తి చేసి నదుల అనుసంధానం చేయాల్సి వుంది. అమరావతి నిర్మాణం చేసి ఉద్యోగాలు, సంపద సృష్టి చేయాల్సి ఉంది. నీలి మీడియా, జగన్ మాఫియా దుష్ప్రచారాలు, దాడులు ఎదుర్కోవాల్సి వుంటుంది. ఈ విజయంతో కూటమి శ్రేణులు నమ్రత పెంచుకుని ప్రజాభిమానాన్ని మరింత పెంచుకోవాలి.



2004లో చంద్రబాబు ఓడిపోకుండా వుంటే నేడు ప్రతి జిల్లా కేంద్రం మరో సైబరాబాద్ అయి వుండేది. 2019లో ఓడిపోకుండా వుంటే నేటికి 175 నియోజకవర్గ కేంద్రాలు ఉపాధి కల్పనా కేంద్రాలుగా అభివృద్ధి అయి వుండేవి. రాష్ట్రానికి జగన్ విధ్వంసం వల్ల కలిగిన నష్టాన్ని అధిగమించాలి. అందుకు చంద్రన్న నాయకత్వమే తగినదని ప్రజలు నిర్ణయించారు. అందుకే, క్లాసు, మాసు ఒక్కటై బందిపోట్ల ముఠాను చిత్తుచిత్తుగా ఓడించాయి. జగన్ అండ్ కో ఒక్కో కుటుంబంపై రూ.8 లక్షల భారం మోపాడు. విషపూరిత మద్యం పోసి 35 లక్షల మంది పేదల ఆరోగ్యాలను పాడు చేశాడు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, అగ్రవర్ణ పేదల అసైన్‌మెంట్ భూములు 10 లక్షల ఎకరాలు కొల్లగొట్టారు. లక్ష కోట్ల సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్ళించాడు. పంచాయతీలు, మున్సిపాలిటీల నిధులు దారిమళ్లించి స్థానిక పాలనను నిర్వీర్యం చేశారు. పోలవరాన్ని గండికొట్టి కరువుకోరలకు ప్రజల్ని బలిపెట్టాడు. విశాఖ భూ కబ్జాల కోసం అమరావతిపై నిందలు మోపి ఉద్యోగాలు, సంపద సృష్టించే రాజధాని లేకుండా చేశాడు. ల్యాండ్, శాండ్, వైన్, మైన్, గంజాయి, డ్రగ్స్, ఎర్రచందనం మాఫియాగా మారి రూ.10 లక్షల కోట్లు విలువ గల ప్రకృతి వనరుల్ని, ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టారు. ప్రయివేట్ ఆస్తుల్ని, భూముల్ని కబ్జా చేయడానికి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చారు. ప్రశ్నించిన పౌరుల్ని, మీడియాను, మేధావుల్ని, ప్రతిపక్షాలపై అక్రమ కేసులు పెట్టి జైళ్లలో తోయించాడు. చిన్నాన్న హంతకుల్ని కూడా కాపాడే దుర్మార్గ స్థితికి దిగజారాడు. తన నేరాలు, ఘోరాల నుండి ప్రజల దృష్టి మళ్ళించడానికి కుల, మత, ప్రాంతీయ విద్వేషాల్ని రెచ్చగొట్టాడు. పదిచ్చి వంద గుంజుకొన్న వైనాన్ని పేదలు అర్థం చేసుకున్నారు. తన స్వార్థ రాజకీయం కోసం 30 మందికి పైగా పింఛన్‌దారుల ప్రాణాలు పోగొట్టి శవ రాజకీయం చేశాడు. గులకరాయి దాడి కథ నడిపి ఓ బీసీ బిడ్డను 45 రోజులు జైలుపాలు చేశాడు. కోడికత్తి డ్రామాతో దళిత యువకుణ్ణి ఐదేళ్ళు జైలుపాలు చేశాడు. పేదల్ని ఇలా కాల్చుకు తిని పేదల మనిషిగా కపట ప్రేమ ఒలకబోశాడు. పేదల ద్రోహి జగన్ అని, పేదల పెన్నిధి చంద్రన్న అని గుర్తించి వైకాపాకు పేదలు తగిన శాస్తి చేశారు. అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాలు కూటమికి అఖండ విజయం చేకూర్చాయి. రాష్ట్ర చరిత్రలో ప్రతిపక్ష నాయకత్వ హోదా కోల్పోయింది జగన్ ఒక్కడే.

**– గురజాల మాల్యాద్రి**
టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి

## మోదీ మ్యాజిక్ ఏమయింది?

'రాసిన అక్షరం కన్నా ఉపన్యాసాలే జనాన్ని ప్రభావితం చేస్తాయని నాకు తెలుసు. మహా మహా రచయితలు సాధించలేని మార్పు ఈ భూమిపై గొప్ప వక్తలే సాధించారు' అని జర్మనీ నియంత హిట్లర్ తన ఆత్మకథ 'మెయిన్ కాంఫ్' (ఆంగ్లంలో 'మై స్ట్రగుల్') ముందుమాటలో రాశారు. కాని నేతలు ఎంత గొప్ప వక్తలైనా వారి మాటల్లో నిజాయితీ లేకపోతే, రోజుకో రకంగా మాట్లాడితే, మాట్లాడిన మాటల్లో అబద్ధాలున్నాయని తేలితే ప్రజలు ఆ మాటల్ని విశ్వసించరని ఎవరికి ఎప్పుడు ఎలా బుద్ధి చెప్పాలో వారికి బాగా తెలుసని మంగళవారం నాడు వెల్లడైన 18వ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఈ ఫలితాలను సువర్ణ ఘట్టంగా భావించవచ్చు.

ఒక దశాబ్ద కాలం (2014–24)లో దేశంలో అన్ని వ్యవస్థలపై పట్టు సాధించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ తానేమి చేసినా ప్రజలు హర్షిస్తారని, కేవలం తన ప్రచారంతోనే వారు మైమరిచిపోయి బీజేపీకి పట్టం కడతారని ఆశించినట్లు అర్థమవుతోంది. ఈ ఏడాది దేశ వ్యాప్తంగా ఆయన దాదాపు 200 ఎన్నికల సభల్లో ప్రసంగించారు. వివిధ భాషల్లో కనీసం 50 టీవీ చానెల్స్‌కు ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఎన్నికలు లేనప్పుడు కూడా ఆయన నెలకు కనీసం 20 ప్రసంగాలు చేశారు. టీవీ చానెల్స్, సోషల్ మీడియా యుగం కనుక తన హావభావాలతోనూ, ధ్యానముద్రలతోనూ కూడా జనాన్ని ఆయన ప్రభావితం చేయాలనుకున్నారు. తన పేరును తానే వందలసార్లు ఉచ్చరించారు. బీజేపీకి స్టార్ క్యాంపెయినర్లు ఎంతో మంది ఉన్నప్పటికీ మోదీయే అసలైన స్టార్ క్యాంపెయినర్‌గా వ్యవహరించారు. నూతన పార్లమెంట్ భవనం ప్రారంభం నుంచి రాముడి ప్రాణప్రతిష్ఠ వరకు తానొక్కడే అన్నట్లుగా వ్యవహరించారు. పదే పదే ఒకే మాట చెబితే జనం నమ్ముతారేమోనని భావించి చార్ సౌ పార్ (400కు పైగా) సీట్లు సాధిస్తామని చెప్పుకున్నారు. కాంగ్రెస్ ఈ సారి 50 సీట్లు కూడా దాటదని చెప్పారు. తానేది చెబితే జనం అది నమ్ముతారని పరిపూర్ణంగా విశ్వసించిన మోదీ ప్రతిపక్షాలు ప్రజల వనరులను ముస్లింలకు పంచిపెడతారని చెప్పేందుకు కూడా వెనుకాడలేదు. మహాత్ముడిపై రిచర్డ్ అటెన్ బరో సినిమా తీయక ముందు గాంధీ ఎవరో లోకానికి తెలియదని చెప్పేందుకు కూడా ఆయన తెగించారు!

రోజురోజుకూ ఒక వ్యక్తి కేంద్రీకృత వ్యవస్థగా మారిన భారతీయ జనతా పార్టీకి మోదీ తిరుగులేని నాయకుడే కావచ్చు. అయన నాయకత్వానికి ఆయనే ముగ్ధుడై తనది కారణ జన్మ అని, దేవుడే తనను పంపించాడని చెప్పుకున్నారు. పూరీ జగన్నాథుడే మోదీ భక్తుడని బీజేపీ అధికార ప్రతినిధి ఒకరు వ్యాఖ్యానించారు. మోదీ నేతృత్వంలో భారతీయ జనతా పార్టీ నిర్మాణపరంగా ఎంతో ఎదిగిపోయిందని, దానికి ఆర్‌ఎస్ఎస్ వంటి సంస్థ అవసరం ఇక ఏ మాత్రం లేదని భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డాయే ప్రకటించారు. గంటకు పైగా ఇంటర్వ్యూలు చేయడం తప్ప ప్రజల మనసుల్లో ఉన్న ప్రశ్నలను లేవనెత్తాలని జర్నలిస్టుల రూపంలో వచ్చిన టీవీ ప్రతినిధులు కూడా అనుకోలేదు. ఏమైతేనేం దాదాపు 80 రోజులుగా జరిగిన ఎన్నికల ఘట్టంలో ఎన్నో నాటకీయ దృశ్యాలు, భావోద్వేగ ప్రసంగాలు, ఉత్కంఠభరితమైన సన్నివేశాలు చూసే అవకాశం కలిగింది. అంతిమంగా ఎగ్జిట్ పోల్స్ నిర్వహించిన దాదాపు డజన్ సంస్థలు ఎన్డీఏకు 350కి పైగా స్థానాలు లభిస్తాయని, మోదీ అన్నట్లుగా 400 దాటినా ఆశ్చర్యపోనక్కర్లేదని ప్రకటించడంతో ఈ దేశంలో మీడియా సంస్థల దైర్యం ఎంత దిగజారిపోయిందో, ఎందుకు వారు భయోత్పాతానికి గురయ్యారో అర్థం అవుతుంది. కేవలం షేర్ మార్కెట్ పతనం కాకుండా ఉండేందుకే వారు అలా చేశారా అన్న అనుమానాలూ లేకపోలేదు.

నిజానికి మోదీని ఢీకొనడం అంత సులభం కాదని, ఆయన ఏ విధంగానైనా తాను అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని అనుకున్నవారే ఎక్కువగా ఉన్నారు. చండీగఢ్‌లో మేయర్ ఎన్నికల్లో బ్యాలట్ పేపర్లలో మార్పులు చేయడం, సూరత్‌లో కాంగ్రెస్ అభ్యర్థి పేరును ప్రతిపాదించినవారు రిటర్నింగ్ అధికారి వద్దకు రాలేకపోవడం, ఇండోర్‌లో నామినేషన్ వేసిన కాంగ్రెస్ అభ్యర్థి చివరి నిమిషంలో నామినేషన్ ఉపసంహరించుకోవడం, ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ఇద్దరు ముఖ్యమంత్రులు అరెస్టు కావడం వంటి ఘట్టాల తర్వాత ఇక మోదీ ఘన విజయాన్ని ఎవరు ఆపగలరులే అని చాలా మంది భావించారు. ఈడీ, సిబిఐ వంటి సంస్థలు సృష్టించిన భయోత్పాతం అంతా ఇంతా కాదు. పార్లమెంట్‌లో చర్చలు లేకుండా, ప్రతిపక్షాలు లేకుండా బిల్లులు ఆమోదించడంతో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైందనిపించింది. ఎన్నికల బాండ్లపై సుప్రీం తీర్పుతో బీజేపీ అక్రమ నిధుల వసూళ్ల గురించి జనానికి తెలిసినా పెద్దగా పట్టించుకోరేమో అనిపించింది. కాని ఆశ్చర్యకరంగా ఎన్నికల ఫలితాలను చూస్తే మోదీ మాయాజాలం చాలా మటుకు మాయమైపోయినట్లు అర్థమవుతోంది.



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

నిజానికి ఈ ఎన్నికల్లో ప్రతిపక్షాలు అవసరమైనంత సంఘటితంగా పనిచేయలేదు. ఇండియా కూటమి ఏర్పాటైన కొద్ది రోజుల్లోనే ఆ పార్టీలో సీనియర్ నాయకుడు నితీశ్ కుమార్ ప్లేటు ఫిరాయించి మరోసారి బీజేపీతో చేతులు కలిపారు. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్‌లో ఇండియా కూటమి సభ్యులకు తగినన్ని సీట్లు ఇచ్చేది లేదని చెప్పేశారు. పంజాబ్‌లో కూడా కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేయాల్సి వచ్చింది. కాంగ్రెస్ ఖాతాలను స్తంభింపచేయడంతో ఆ సంస్థ ఆర్థికంగా బలహీనపడింది. మధ్యప్రదేశ్, హర్యానాలాంటి చోట్ల బలమైన కాంగ్రెస్ నేతల్ని బీజేపీ తన వైపునకు తిప్పుకుంది. పశ్చిమ బెంగాల్‌లో ప్రతిపక్ష పార్టీలను నిలువునా చీల్చారు. ఎన్నో బలహీనతలు, సమస్యలు, వనరుల లోపాల మధ్య కొట్టుమిట్టాడుతూ ప్రతిపక్షాలు ప్రచారాన్ని నిర్వహించాయి. మోదీ, ఆయన దళం చేసిన భారీ ప్రచారం ముందు ప్రతిపక్షాల ప్రచారం వెలవెలబోయినట్లు కనిపించింది. అయినప్పటికీ ఇవాళ బీజేపీ గత రెండు ఎన్నికల్లో మాదిరి మెజారిటీ సీట్లు సాధించలేకపోవడం, ఇండియా కూటమికీ, ఎన్డీఏకు మధ్య సీట్ల వ్యత్యాసం బాగా తగ్గిపోవడం మోదీ ఏకవ్యక్తాధిపత్యాన్ని జనం కోరుకోవడం లేదని అనుకోవడానికి ఆస్కారం కలిగిస్తుంది.




**నిజానికి బీజేపీ నుంచి గెలిచిన వారిలో ఒరిజినల్ బీజేపీ నేతలకన్నా బయటి పార్టీల నుంచి వచ్చిన వారు చెప్పుకోదగ్గ సంఖ్యలోనే ఉన్నారు. మోదీ మూలంగానే బీజేపీకి ప్రాభవం ఏర్పడిందని చెప్పడానికి వీల్లేదు. 2014లో కొన్ని సామాజిక, చారిత్రక, ఆర్థిక కారణాల వల్ల బీజేపీకి ప్రజలు పట్టం కట్టారు. పుల్వామా, బాలాకోట్ సంఘటనలు జరగకపోతే 2019లో బీజేపీకి మెజారిటీ వచ్చేది కాదేమో? కేవలం మోదీ పేరును మార్మోగిస్తే సరిపోదని 2024లో తేలిపోయింది.**

ఉత్తరప్రదేశ్ లాంటి బీజేపీ కంచుకోటలో సగానికి సగం సీట్లు కోల్పోవడం, అయోధ్య భాగంగా ఉన్న ఫైజాబాద్‌లోనే బీజేపీ అభ్యర్థి ఓడిపోవడం దేనికి సంకేతం? గతంలో కూడా బాబ్రీ మసీదు కూల్చివేత తర్వాత జరిగిన నాలుగు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ పరాజయం పాలైంది. అయోధ్యలో నాడు కూడా బీజేపీ అభ్యర్థి ఓటమి పాలయ్యారు. ఇప్పుడు రామమందిర నిర్మాణం తర్వాత కూడా యూపీలో బీజేపీ ప్రాభవం తగ్గిపోవడం ఏ సంకేతాలు పంపిస్తున్నాయి? రామమందిర నిర్మాణం కల్పించిన భావోద్వేగాలు పొంగే కాని, వాపు కాదని, ఈ దేశంలో మతాన్ని రాజకీయాలతో సమ్మిళితం చేయడాన్ని రాజ్యాన్ని ప్రజలు విశ్వసించడం లేదని అనుకోవాలా? లేక ప్రధానమంత్రి నరేంద్రమోదీ మతాన్ని తన స్వంత రాజకీయాలకు ఉపయోగించుకోవడాన్ని జనం హర్షించడం లేదని భావించాలా? నిజానికి మోదీ వన్ మాన్ షోను కొందరు ఆర్ఎస్ఎస్ నేతలే హర్షించలేదు. ఈ ఎన్నికల్లో మోదీకి సంపూర్ణ మెజారిటీ రాకపోతేనే మంచిదని, వస్తే తమను కూడా లెక్కచేయరని అనుకున్న ఆర్ఎస్ఎస్ పెద్దలు కూడా ఉన్నారు. ఎందుకో నాగపూర్ కూడా ఈ సారి అన్యమనస్కంగానే వ్యవహరించింది. ఆర్ఎస్ఎస్ పూర్తిగా బీజేపీని వదిలేస్తే ఈ 240 సీట్లు కూడా వచ్చేవి కావని అనుకునేవారు ఉన్నారు.

నిజానికి బీజేపీ నుంచి గెలిచిన వారిలో ఒరిజినల్ బీజేపీ నేతలకన్నా బయటి పార్టీ నుంచి వచ్చిన వారు చెప్పుకోదగ్గ సంఖ్యలోనే ఉన్నారు. ఉదాహరణకు తెలంగాణలో బీజేపీ నుంచి గెలిచిన వారిలో సగానికి పైగా ఇతర పార్టీల నుంచి వచ్చినవారే. కేరళలో సినీనటుడు సురేష్ గోపీ బీజేపీ బలంతో కన్నా తన వ్యక్తిగత ఆకర్షణ ఆధారంతో గెలిచారనవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం మద్దతు లేకపోతే బీజేపీకి అసెంబ్లీలో కాని, పార్లమెంట్‌లో కాని ఒక్క సీటు కూడా వచ్చే అవకాశం లేదు. అందువల్ల మోదీ మూలంగానే బీజేపీకి ప్రాభవం ఏర్పడిందని చెప్పడానికి వీల్లేదు. 2014లో కొన్ని సామాజిక, చారిత్రక, ఆర్థిక కారణాల వల్ల భారతీయ జనతా పార్టీకి ప్రజలు పట్టం కట్టారు. పుల్వామా, బాలాకోట్ సంఘటనలు జరగకపోతే 2019లో కూడా బీజేపీకి మెజారిటీ వచ్చేది కాదని చెప్పేవారు కూడా లేకపోలేదు. 2024లో కేవలం మోదీ పేరును మార్మోగిస్తే సరిపోదని తేలిపోయింది.

ఏమైతేనేం పది సంవత్సరాల తర్వాత దేశంలో మళ్లీ సంకీర్ణ రాజకీయాలు ప్రారంభమయ్యాయి. రెండుసార్లు అఖండమైన మెజారిటీతో బీజేపీని గెలిపించినప్పటికీ మోదీ మళ్లీ దేశం సంకీర్ణ యుగంలోకి వెళ్లకుండా చేయలేకపోయారు. ఇది కూడా మంచి పరిణామమే. రాష్ట్రాల ఆకాంక్షలను విస్మరించకుండా ఉండేందుకు ఇది తోడ్పడుతుంది. నిజానికి ఈ పదేళ్ల ప్రజాస్వామికంగా, ఏకాభిప్రాయ సాధనతో పరిపాలన సాగించి ఉంటే, ప్రతిపక్షాలనూ విశ్వాసంలోకి తీసుకుని ఉంటే, అన్ని వ్యవస్థల్నీ నియంత్రణలోకి తీసుకోకుండా వాటిని పారదర్శకంగా స్వేచ్ఛగా పని చేయించి ఉంటే, ఏడాదికి కనీసం ఒక్క విలేఖరుల సమావేశమైనా నిర్వహించి అరమరికలు లేకుండా మాట్లాడి ఉంటే, ప్రతిపక్షాలను అణచివేయాలన్న ఆలోచనను వదిలిపెట్టి ఉంటే మోదీ మళ్లీ భారీ మెజారిటీతో తిరిగి వచ్చేవారేమో. ఒక బలమైన వ్యవస్థ, బలమైన భావజాలం ఉన్నప్పటికీ అవి ఒక వ్యక్తి చుట్టూ తిరిగితే విజయవంతం కాలేవని ఈ ఎన్నికలు స్పష్టం చేశాయి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

## స్వచ్ఛమైన పర్యావరణమే గొప్ప వారసత్వ ఆస్తి!

భూమిపై ఉన్న అన్ని జీవులకు పర్యావరణం ప్రాథమిక జీవన సహాయక వ్యవస్థ. ఇది సహజ, మానవ నిర్మిత భాగాల కలయిక. సహజ భాగాలలో గాలి, నీరు, భూమి, జీవులు ఉన్నాయి. రోడ్లు, పరిశ్రమలు, భవనాలు మొదలైనవి మానవ నిర్మిత భాగాలు. సహజ వాతావరణాన్ని నాలుగు ప్రధాన భాగాలుగా విభజించవచ్చు – బయోస్పియర్, లిథోస్పియర్, హైడ్రోస్పియర్, అట్మాస్పియర్. భూమిపై పొరను లిథోస్పియర్ అని పిలుస్తారు. ఇది రాళ్ళు, ఖనిజాలతో చేసిన నేల పలుచని పొర. హైడ్రోస్పియర్ సముద్రాలు, మహాసముద్రాలు, నదులు, సరస్సులు, చెరువులు మొదలైన నీటి వనరులను కలిగి ఉంటుంది. నీటి ఆవిరి, వాయువులు, ధూళి కణాలతో కూడిన వాతావరణం భూమిని చుట్టుముట్టే గాలి పొర. మానవులు, మొక్కలు, జంతువులతో కూడిన జీవ ప్రపంచం జీవగోళాన్ని ఏర్పరుస్తుంది. పర్యావరణాన్ని తయారు చేయడంలోను, విచ్ఛిన్నం చేయడంలోనూ మానవులు భారీ పాత్ర పోషిస్తున్నారు. భూమిపై అత్యున్నత మేధోశక్తిగా, మానవులు పర్యావరణ క్షేమాన్ని చాలావరకు ప్రభావితం చేస్తారు. అన్ని జీవులపై పర్యావరణ ప్రభావం మానవులు పర్యావరణంతో వ్యవహరించే విధానానికి నేరుగా అనులోమానుపాతంలో వుంటుంది. గాలి, నీరు లేదా భూమి లేకుండా ఎలాంటి ఉనికి సాధ్యం కాదు.

భూమిపై సంచరించే అన్ని రకాల ప్రాణుల ఉనికికి పర్యావరణమే ప్రాథమిక మూలం. అయితే, నేడు పర్యావరణం విపరీతంగా దోపిడీ చేయబడుతోంది, దీని కారణంగా పర్యావరణ పరిస్థితులు రోజురోజుకు అధ్వాన్నంగా మారుతున్నాయి. గాలి, నీరు మరియు భూమి కాలుష్యం, మైనింగ్, పారిశ్రామికీకరణ, ఆధునిక పట్టణీకరణ, అటవీ నిర్మూలన, రసాయన వ్యర్థాల విడుదల వంటివి పర్యావరణం క్రమంగా క్షీణించడానికి కారణమయ్యే కొన్ని ప్రధాన కారకాలు.

పర్యావరణపు వేగవంతమైన క్షీణతను తగ్గించడానికి ప్రపంచ నాయకులు కృషి చేస్తున్నారు. అలాగే ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలు పర్యావరణ సమస్యలను అరికట్టడానికి ప్రజలకు అవగాహన కల్పించడానికి, చర్యలు తీసుకోవడానికి చొరవతో ముందుకు వచ్చాయి. ఈ కార్యక్రమాల్లో కొన్ని 2019 సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ సమ్మిట్, 2019 క్లైమేట్ యాక్షన్ సమ్మిట్, సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ కోసం 2030 ఎజెండా, పారిస్ ఒప్పందం, ఇంకా నదుల సంరక్షణ, అటవీ పెంపకం, తీర నిర్వహణ, చిత్తడి నేల పరిరక్షణ మొదలైన అనేక ఇతర కార్యక్రమాలు చేపట్టాయి. తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మొక్కుబడి కార్యక్రమాలు చేస్తున్నాయి. ప్రచార ఆర్భాటంగా పర్యావరణ దినోత్సవం రోజున కొన్ని మొక్కలు నాటుతున్నాయి. నాయకుల పర్యటనల సందర్భంగా అవి అడ్డుగా ఉంటున్నాయని అధికారులు కొన్ని చెట్లను నరికేస్తున్నారు. ఇలాంటి విధానాలకు స్వస్తి చెప్పాలి. చిత్తశుద్ధితో మొక్కలు నాటి, వాటి పోషణ భారాన్ని కూడా ప్రభుత్వాలు చిత్తశుద్ధితో స్వీకరించాలి. కవులు, రచయితల నుండి పర్యావరణ సాహిత్యాన్ని ఆహ్వానించి, ప్రోత్సహించి పుస్తకాలుగా అచ్చేసి రేపటితరానికి అందించాలి. పర్యావరణం కేంద్రంగా పాఠ్యపుస్తకాలను రూపొందించాలి.

వన్యప్రాణులు, వివిధ జాతుల మనుగడ కోసం పర్యావరణాన్ని పరిరక్షించడం అవసరం. వాతావరణ మార్పుల వినాశకరమైన వేగంతో, కాలుష్యం – పర్యావరణం దోపిడీ ఫలితంగా, పర్యావరణానికి మరింత నష్టం జరగకుండా రక్షించే మార్గాలను కనుగొనడం మొదటి ప్రాధాన్యతగా వుండాలి. పర్యావరణాన్ని మానవ దోపిడీకి ముందున్న పూర్వ స్థితికి తీసుకురావడం చాలా ముఖ్యమైన, ఏకైక పరిష్కారం.

కొందరు తమ స్వార్థం కోసం కొండల్ని పిండి చేస్తున్నారు, చెట్లన్నీ నేల కూలుస్తున్నారు, నీటి నిల్వల్ని పీల్చేస్తున్నారు, జంతువుల్ని వేటాడి చంపుకు తింటున్నారు, పక్షుల్ని కాల్చుకు తింటున్నారు. మొత్తం పర్యావరణాన్ని దోచేసి ఆర్థిక నిల్వల్ని పెంచుకుంటున్నారు. రేపటి తరానికి అసలు పర్యావరణ పచ్చదనపు ఆనవాలు లేకుండా చేస్తున్నారు. మంచి గాలి, నీరు, భూమి, ఆహ్లాదం లేకుండా రేపటితరం ఎలా జీవించగలుగుతుంది? ఆస్తులుంటే సరిపోతుందా? పీల్చేందుకు ఆక్సిజన్ అవసరం లేదా? పర్యావరణ పరిరక్షణంతా ప్రభుత్వ బాధ్యతగానే భావించకుండా ప్రజలు కూడా తమవంతుగా కృషి చేయాల్సిన అవసరం వుంది. పచ్చని పర్యావరణాన్ని కొల్లగొట్టడం మాని, మనిషికొక మొక్కయినా నాటాలి. ఆ కోట్లాది మొక్కలు నేలపై తల ఎత్తుకు నిలబడి, మన ఆరోగ్యాన్ని అనారోగ్యం వైపునకు వాలిపోకుండా నిలబెడతాయి.

**– కలిమిశ్రీ,** నవ్యాంధ్ర రచయితల సంఘం
(నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్:editpage@andhrajyothy.com

# ప్రభంజనం


ఏపీ తీర్పు @ 2024

జనం తలచుకుంటే ఇలాగే ఉంటుంది. అహంకారాన్ని, నియంతృత్వాన్ని అంగీకరించమని ప్రజలు కసితీరా ఓటు వేశారు. వైసీపీ ప్రచారానికి మోసపోకుండా తీర్పు ప్రకటించారు. వైసీపీకి అనూహ్య ఓటమిని కట్టబెట్టారు. జిల్లాలో రెండు సీట్లు మినహా మిగతా అన్ని స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించారు.





## నియోజకవర్గాల వారీగా ఫలితాలు



### కర్నూలు



(19 రౌండ్లు పూర్తి ఫలితం)
మొత్తం ఓట్లు: 1,78,594
విజేత: టీజీ భరత్ - టీడీపీ
వచ్చిన ఓట్లు: 91,690
మెజారిటీ: 18,876
రెండో స్థానం : ఇంతియాజ్, వైసీపీ 72,814
మూడో స్థానం - కాంగ్రెస్
ఓట్లు - 9,022
నాలుగో స్థానం: నోటా: 718 ఓట్లు

### ఆదోని



( 19 రౌండ్లు పూర్తి ఫలితం)
మొత్తం ఓట్లు: 17,4,582
విజేత: పార్థసారథి, బీజేపీ కూటమి
వచ్చిన ఓట్లు: 88,943
మెజారిటీ: 17,646
రెండో స్థానం: సాయిప్రసాద్‌రెడ్డి, వైసీపీ
వచ్చిన ఓట్లు - 71297
మూడో స్థానం: రమేష్‌యాదవ్, కాంగ్రెస్
వచ్చిన ఓట్లు - 7567
నాలుగో స్థానం: స్వంత్ర అభ్యర్థి ఆసియాభాను
వచ్చిన ఓట్లు - 1597

### నంద్యాల



(21 రౌండ్లు పూర్తి ఫలితం)
విజేత: ఎన్‌ఎండీ ఫరూఖ్, టీడీపీ
మొత్తం ఓట్లు: 2,08,578
వచ్చిన ఓట్లు: 1,03,075
మెజారిటీ: 12,333
రెండో స్థానం : శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, వైసీపీ
ఓట్లు - 90,742
మూడో స్థానం: గోకుల్ కృష్ణారెడ్డి (కాంగ్రెస్)
6,418 ఓట్లు
నాలుగో స్థానం: నోటా
1,518 ఓట్లు

### పాణ్యం



( 26 రౌండ్లు పూర్తి ఫలితం)
విజేత: గౌరు చరిత, టీడీపీ
మొత్తం ఓట్లు: 2,50,276
వచ్చిన ఓట్లు: 1,41,272
మెజారిటీ: 40,591
రెండో స్థానం: కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైసీపీ
ఓట్లు - 1,00,681
మూడో స్థానం: గౌస్ దేశాయ్ (సీపీఐ)
ఓట్లు - 3,081
నాలుగో స్థానం: నోటా
ఓట్లు - 2,663

### కోడుమూరు



( 20 రౌండ్లు పూర్తి ఫలితం)
విజేత : బొగ్గుల దస్తగిరి- టీడీపీ
మొత్తం ఓట్లు: 1,97,533
వచ్చిన ఓట్లు: 1,01,703
మెజారిటీ: 21,583
రెండో స్థానం: ఆదిమూలపు సతీష్
ఓట్లు - 80,120
మూడో స్థానం - మురళీకృష్ణ (కాంగ్రెస్):9,835
నాలుగో స్థానం: నోటా, 2,169 ఓట్లు

### డోన్



(21 రౌండ్లు పూర్తి ఫలితం)
విజేత : కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, టీడీపీ
మొత్తం ఓట్లు: 1,90,120
వచ్చిన ఓట్లు: 93,523
మెజారిటీ: 6049
రెండో స్థానం: బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, వైసీపీ
ఓట్లు - 87,474
మూడో స్థానం: గార్లపాటి మద్దిలేటి(కాంగ్రెస్)
ఓట్లు - 3,988
నాలుగో స్థానం: ఓట్లు - 60,49

### శ్రీశైలం



( 21 రౌండ్లు పూర్తి ఫలితం )
విజేత : బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, టీడీపీ
మొత్తం ఓట్లు: 1,64,580
వచ్చిన ఓట్లు: 81,699
మెజారిటీ: 6,385
రెండో స్థానం: శిల్పా చక్రపాణిరెడ్డి, వైసీపీ
ఓట్లు - 75,314
మూడోస్థానం: ఇస్మాయిల్ (కాంగ్రెస్)
ఓట్లు - 3,429
నాలుగో స్థానం: నోటా: 1,077 ఓట్లు

### ఆలూరు



(21 రౌండ్లు పూర్తి ఫలితం)
విజేత : విరుపాక్షి, వైసీపీ
మొత్తం ఓట్లు: 20,9092
వచ్చిన ఓట్లు: 1,00264
మెజారిటీ: 2831
రెండో స్థానం: వీరభద్రగౌడ్, టీడీపీ
ఓట్లు - 97,433
మూడో స్థానం: కిశోర్, కాంగ్రెస్
ఓట్లు - 5772
నాలుగో స్థానం: నోటా
ఓట్లు - 2634

### ఎమ్మిగనూరు



(20 రౌండ్ల పూర్తి ఫలితాలు)
విజేత: జయనాగేశ్వర్‌రెడ్డి- టీడీపీ
మొత్తం ఓట్లు: 2,03,086
వచ్చిన ఓట్లు: 101212
మెజారిటీ: 14,816
రెండో స్థానం: బుట్టా రేణుక
ఓట్లు - 86,396
మూడో స్థానం: ఖాశిం వలి( కాంగ్రెస్)
7,748 ఓట్లు
నాలుగో స్థానం: నోటా: 2,357 ఓట్లు

### బనగానపల్లె



( 18 రౌండ్లు పూర్తి ఫలితం)
విజేత: బీసీ జనార్దన్‌రెడ్డి, టీడీపీ
మొత్తం ఓట్లు: 2,05,740
వచ్చిన ఓట్లు: 1,10,603
మెజారిటీ: 25,566
రెండో స్థానం: కాటసాని రామిరెడ్డి, వైసీపీ
ఓట్లు - 85,037
మూడోస్థానం: పుల్లయ్య (కాంగ్రెస్ ): 3,344
నాలుగో స్థానం: నోటా: 1,528

### నందికొట్కూరు



(26 రౌండ్ల పూర్తి ఫలితం)
విజేత: గిత్తా జయసూర్య, టీడీపీ
మొత్తం ఓట్లు: 1,86,853
వచ్చిన ఓట్లు: 92,004
మెజారిటీ: 9,648
రెండో స్థానం: ధారా సుధీర్, వైసీపీ
ఓట్లు - 82,212
మూడోస్థానం: ఆర్థర్ (కాంగ్రెస్):
ఓట్లు - 7,949
నాలుగో స్థానం: నోటా: 1,274 ఓట్లు

### మంత్రాలయం



( 17 రౌండ్ల పూర్తి ఫలితం )
విజేత : బాలనాగిరెడ్డి, వైసీపీ
మొత్తం ఓట్లు: 1,76,324
వచ్చిన ఓట్లు: 87,662
మెజారిటీ: 12,805
రెండో స్థానం: రాఘవేంద్రరెడ్డి, టీడీపీ
ఓట్లు - 74,857
మూడోస్థానం: మురళీకృష్ణ కాంగ్రెస్,
ఓట్లు - 4,660
నాలుగో స్థానం: నోటా
ఓట్లు - 3,674

### పత్తికొండ



(19 రౌండ్లు పూర్తి ఫలితం)
గెలిచిన అభ్యర్థి: కేఈ శ్యాంబాబు
పార్టీ: టీడీపీ
మెజారిటీ: 14,211
మొత్తం ఓట్లు: 1,91,63
గెలిచిన అభ్యర్థికి వచ్చిన ఓట్లు: 98,849
రెండో స్థానంలో కంగాటి శ్రీదేవి, వైసీపీ అభ్యర్థి, పార్టీ వైసీపీ
ఓట్లు: 84,638
మూడో స్థానంలో నోటాకు: 2,070
నాలుగో స్థానంలోని అభ్యర్థి, పార్టీ, ఓట్లు : 1,956, సీపీఐ

### ఆళ్లగడ్డ



( 22 రౌండ్లు పూర్తి ఫలితం)
గెలిచిన అభ్యర్థి: భూమా అఖిలప్రియ, టీడీపీ
మొత్తం ఓట్లు: 1,98,052
మెజారిటీ: 12,037
వచ్చిన ఓట్లు: 98,881
రెండో స్థానం: గంగుల బిజేంద్రనాథ్‌రెడ్డి, వైసీపీ
ఓట్లు: 86,844
మూడో స్థానం: హుసేన్ బాషా (కాంగ్రెస్)
ఓట్లు: 6,100
నాలుగో స్థానం: నోటా :1582,ఓట్లు

### కర్నూలు పార్లమెంటు



( పూర్తి ఫలితం )
విజేత : బస్తిపాటి నాగరాజు, టీడీపీ
మొత్తం ఓట్లు: 13,30,780
వచ్చిన ఓట్లు: 6,58,914
మెజారిటీ: 1,11,298
రెండో స్థానం: బీవై రామయ్య, వైసీపీ
ఓట్లు - 5,47,616
మూడో స్థానం: రాంపుల్లయ్య యాదవ్ (కాంగ్రెస్)
ఓట్లు - 70,373
నాలుగో స్థానం: నోటా
ఓట్లు - 10,511

### నంద్యాల పార్లమెంటు



( పూర్తి ఫలితం )
విజేత : శబరి, టీడీపీ
మొత్తం ఓట్లు: 14,04,418
వచ్చిన ఓట్లు: 7,01131
మెజారిటీ: 1,11975
రెండో స్థానం: పోచా బ్రహ్మానందరెడ్డి, వైసీపీ
ఓట్లు - 5,89156
మూడో స్థానం : లక్ష్మీనరసింహ యాదవ్ (కాంగ్రెస్)
ఓట్లు - 56,204
నాలుగో స్థానం : నోటా
ఓట్లు - 1,0697

## పసుపు జెండా రెపరెపలు

- 39 ఏళ్ల తర్వాత కోడుమూరులో టీడీపీ గెలుపు
- వైసీపీ కోటను బద్దలు కొట్టిన బొగ్గుల దస్తగిరి
- రెండు రౌండ్లు మినహా ప్రతి రౌండ్‌లో టీడీపీ ఆధిక్యత
- 20,866 ఓట్ల మెజారిటీ

కోడుమూరు, జూన్ 4: వైసీపీ పాలన మీద విసుగెత్తిన నియోజకవర్గ ప్రజలు చంద్రబాబునాయుడుకి జై కొట్టారు. ప్రజలు ఎగబడి టీడీపీకి ఓటు వేయడంతో బొగ్గుల దస్తగిరి దాదాపు 20,866 ఓట్ల మెజారిటీతో గెలిచారు. దీంతో కోడుమూరులో ఎట్టకేలకు పసుపు జెండా రెపరెపలాడింది. 39 సంవత్సరాల అనంతరం కోడుమూరులో టీడీపీ అడుగుపెట్టడంతో కార్యకర్తలు సంబరాలు చేసుకొన్నారు. నాయకులు, కార్యకర్తలు 39 సంవత్సరాలుగా టీడీపీ గెలుపు కోసం చేసిన కృషి నేటికి ఫలించింది.



**1962లో ఏర్పడిన కోడుమూరు నియోజకవర్గం :** 1962లో కోడుమూరు నియోజవకర్గం ఏర్పడింది. నాటి నుంచి నేటి వరకు నియోజకవర్గాన్ని ఎస్సీ సామాజిక వర్గానికి రిజర్వ్ చేశారు. మొదటిసారిగా 1962 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య పోటీ చేసి గెలిచారు. 1967లో స్వతంత్ర అభ్యర్థి పీఆర్ రావు గెలిచారు. 1985 సంవత్సరంలో టీడీపీ అభ్యర్థి ఎం. శిఖామణి, 1989లో పెద్దాయన కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఆశీస్సులతో ఇండిపెండెంట్ అభ్యర్థి మదనగోపాల్ గెలిచారు. 1972, 1978, 1983, 1994, 1999, 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులైన దామోదరం మునిస్వామి, ఎం. శిఖామణి, పరిగెల మురళీకృష్ణ గెలిచారు. రాష్ట్ర విభజన అనంతరం 2014, 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు ఎం. మణిగాంధీ, జరదొడ్డి సుధాకర్ విజయం సాధించారు.

**వైసీపీ కోటలో టీడీపీ పాగా :** కోడుమూరు నియోజకవర్గంలో 1985 సంవత్సరంలో టీడీపీ తొలి విజయం సాధించింది. ఆనాడు టీడీపీ అభ్యర్థిగా ఎం. శిఖామణి పోటీ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి దామోదరం మునిస్వామిపై శిఖామణి 6,435 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఇక ఆ తర్వాత టీడీపీ గెలవలేదు. 2014, 2019 సంవత్సరంలో వైసీపీ ఈ నియోజకవర్గాన్ని కైవసం చేసుకుంది. ఈ ఎన్నికల్లో వైసీపీ కోటను బద్దలు కొట్టి కోడుమూరు కోటలోకి బొగ్గుల దస్తగిరి ప్రవేశపెట్టారు.


**రెండు రౌండ్లు మినహా..** మొదటి రౌండ్‌లో వైసీపీకి 443 ఓట్ల మెజారిటీ వచ్చింది. దీంతో వైసీపీ అభ్యర్థి ఆదిమూలపు సతీష్ ముఖంలో చిరునవ్వు కనిపించింది. అయితే రెండో రౌండ్‌లో టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరికి 1055 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఇక 7 రౌండు వరకు టీడీపీకి మెజారిటీ తగ్గలేదు. దీంతో వైసీపీ అభ్యర్థి ఆదిమూలపు సతీష్ ముఖంలో భయం మొదలైంది. 7 రౌండ్లు పూర్తి అయ్యే సరికి టీడీపీకి 8193 ఓట్ల మెజారిటీ వచ్చింది. 8, 19, 20 రౌండులో వైసీపీకి 318, 276, 986 స్వల్ప మెజారిటీ వచ్చింది. మిగిలిన 16 రౌండ్ల టీడీపీ తిరుగులేని మెజారిటీతో దూసుకెళ్లింది. దీంతో బొగ్గుల దస్తగిరి సుమారు 20,866 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

## సెంటిమెంట్ రిపీట్

- టీడీపీ అభ్యర్థి ఎన్‌ఎండీ ఫరూక్ గెలుపు
- రాష్ట్రంలో అధికారంలోకి తెలుగుదేశం

నంద్యాల టౌన్, జూన్ 4 : రాష్ట్ర, దేశ రాజకీయాల్లో విశిష్టమైన నియోజకవర్గంగా పేరొందిన నంద్యాలలో మరోసారి సెంట్‌మెంట్ రిపీట్ అయింది. నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఆనవాయితీ మరోసారి పునరావృతమైంది. నంద్యాలలో ఎమ్మెల్యేగా గెలిచిన అభ్యర్థి పార్టే రాష్ట్రంలో అధికారంలోకి రావడం జరుగుతోంది. 2014 ఎన్నికలు మినహా మిగతా ఎన్నికలన్నింటిలోనూ అదే కొనసాగింది. 1983 నుంచి 2019 వరకు నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి పది సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో 2017లో ఉప ఎన్నిక జరిగింది. ఈ నేపథ్యంలో 9 సార్లు సార్వత్రిక ఎన్నికలు జరగగా 2014 మినహా మిగతా ఎన్నికల్లో నంద్యాల అసెంబ్లీ నుంచి ఏ పార్టీ అభ్యర్థి శాసన సభ్యుడిగా ఎన్నికవుతారో అదే పార్టీ అధికారంలోకి వచ్చింది. 2014లో జరిగిన ఎన్నికల్లో సెంటిమెంట్ గతి తప్పింది. వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన భూమా నాగిరెడ్డి గెలిచారు. రాష్ట్రంలో మాత్రం టీడీపీ అధికార పార్టీగా అవతరించింది. అయితే సరిగ్గా రెండేళ్లకే భూమా నాగిరెడ్డి వైసీపీకి గుడ్‌బై చెప్పి అధికార టీడీపీ గూటిలోకి చేరారు. 2017లో భూమా నాగిరెడ్డి మరణంతో జరిగిన ఉప ఎన్నికలో అధికార పార్టీ అభ్యర్థి టీడీపీ నుంచి పోటీ చేసిన భూమా బ్రహ్మానందరెడ్డి గెలుపొందారు. 2019 ఎన్నికల్లో సెంటిమెంట్ పునరావృతం కాగా ఎమ్మెల్యేగా వైసీపీ అభ్యర్థి శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి గెలిచారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వచ్చింది. ప్రస్తుతం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లోనూ టీడీపీ అభ్యర్థి ఎన్‌ఎండీ ఫరూక్ విజయం సాధించారు. రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలోకి రావడంతో సెంటిమెంట్ పండిందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.








## మొదటి మహిళా ఎంపీ

**నంద్యాల పార్లమెంటుకు 1,11,975 మెజారిటీతో గెలిచిన బైరెడ్డి శబరి**

నంద్యాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పార్లమెంటు నుంచి మొదటిసారి ఓ మహిళా ఎంపీ విజయం సాధించారు. 1952 నుంచి ఇప్పటి వరకు ఉప ఎన్నికలతో కలిపి 20 సార్లు ఎన్నికలు జరిగాయి. అయితే ఇన్నేళ్లలో ఒక్కసారి కూడా మహిళ పోటీ చేయలేదు. మొట్టమొదటిసారిగా ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ తరఫున బైరెడ్డి శబరి పోటీ చేశారు. బరిలోనికి దిగిన తొలిసారే శబరి విజయం సాధించి చరిత్ర సృష్టించారు. గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డి 2,40,000 భారీ మెజారిటీతో గెలిచారు. ప్రస్తుత ఎన్నికల్లో ఆయన మీద పోటీ చేసిన బైరెడ్డి శబరి 1,11,975 ఓట్ల మెజారిటీ సాధించారు.

## పోటీ చేసిన మొదటిసారే అసెంబ్లీకి..

- ఒకరు మాజీ మంత్రి కోట్ల, మరొకరు గిత్తా జయసూర్య

నంద్యాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా నుంచి ఇద్దరు మొదటిసారి అసెంబ్లీలోనికి అడుగు పెడుతున్నారు. ఒకరు మాజీ మంత్రి కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డి కాగా, మరొకరు నందికొట్కూరు నుంచి గిత్తా జయసూర్య. వీరిలో కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డి జిల్లా ప్రజలకు సుపరిచితమైన నేత. ఆయన కేంద్రమంత్రిగా కూడా పనిచేశారు. రాజకీయ పరిణామాల వల్ల మొదటిసారి డోన్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. ఇలా బరిలో నిలిచిన మొదటిసారే బలమైన వైసీపీ అభ్యర్థి మంత్రి బుగ్గనను ఓడించి సంచలనం సృష్టించారు. ఇక నందికొట్కూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసిన గిత్తా జయసూర్య మాత్రం పూర్తిగా కొత్త ముఖం. దాదాపుగా 20 ఏళ్ల నుంచి ఇక్కడ టీడీపీ జెండా ఎగరలేదు. గత ఎన్నికల్లో జిల్లాలోనే వైసీపీ అత్యధిక మెజారిటీని నందికొట్కూరులో సాధించింది. ఈ లెక్కన ఇక్కడ టీడీపీకి బలమైన ఓటు బ్యాంకు ఏమీ లేదు. ఇలాంటి పరిస్థితుల్లో టీడీపీ గెలుపుపై కాస్త అనుమానాలు రేకెత్తాయి. అయితే మాండ్ర శివానందరెడ్డి గిత్తా జయసూర్యకు టికెట్ వచ్చేలా చేయడమే కాకుండా, ఆయన గెలుపునకు అన్ని విధాల సహకరించారు. దీంతో జయసూర్య పోటీ చేసిన మొదటిసారే గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టబోతున్నారు.

**కోడుమూరు:** కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి మొదటిసారి అసెంబ్లీలోనికి అడుగుపెడుతున్నారు. టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి టికెట్ ఇప్పించి, ఆయన గెలుపునకు అన్ని విధాల సహకరించారు. 39 సంవత్సరాల అనంతరం కోడుమూరులో టీడీపీ జెండాను ఎగురవేశారు.

**ఆలూరు:** ఆలూరు వైసీపీ అభ్యర్థి విరుపాక్షి మొదటి సారి అస్లెంబీకి పోటీ చేసి గెలిపొంది, అస్లెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. జడ్పీటీసీ నుంచి ఎమ్మెల్యే వరకు ఎదిగారు. 7 స్థానాల్లో 2 రెండు స్థానాల్లోనే వైసీపీ అభ్యర్థులు గెలుపొందారు.

**ఆదోని:** పార్థసారథి 2019లో కర్నూలు బీజేపీ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2024లో ఆదోని బీజేపీ అభ్యర్థి పార్థసారథి మొదటిసారి పోటీ అస్లెంబీలోకి అడుగుపెడుతున్నారు.

## టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకుల దాడి

- పెద్దభూంపల్లి, కోసిగిలో ఘటనలు
- టీడీపీ కూటమి విజయంతో వైసీపీ నాయకుల్లో వణుకు





గాయపడ్డ టీడీపీ కార్యకర్తలు చిర్తపల్లి ఈరన్న, జనార్దన్


కోసిగి, జూన్ 4: సార్వత్రిక ఎన్నికల ఫలితాల సందర్భంగా మంగళవారం కోసిగి మండల పరిధిలోని పెద్ద భూంపల్లి గ్రామంలో టీడీపీ నాయకుడు పైఇంటి జనార్దన్ ఇంటి మీదికి వైసీపీ నాయకులు మాన్వి వీరేష్, బురుగేని లక్ష్మీరెడ్డి, బురుగేని అంజనేయ, వెంకటేశ్, కార్తీక్, మైపాల్, బెనిగేరి అంజనేయ, సీతమ్మ, రామలక్ష్మీ, వైసీపీ నాయకులు టీడీపీ నాయకులు జనార్దన్, చిర్తపల్లి ఈరన్న, పైంటి లక్ష్మీ అనే ముగ్గురిపై వేటుకొడవళ్లతో హత్యాయత్నం చేశారు. టీడీపీ కూటమి ప్రభంజనాన్ని జీర్ణించుకోలేక బురుగేని లక్ష్మీరెడ్డి, మాన్వి వీరేష్, వైసీపీ నాయకులు కక్షపూరితంగా గ్రామంలోని వైసీపీ నాయకుడు, గ్రామ సర్పంచ్ బురుగేని అంజనేయతో కలిసి సుమారు 9 మంది గ్రామ టీడీపీ నాయకుడు జనార్దన్ రెడ్డి ఇంటిపై వేటుకొడవళ్లతో మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో టీడీపీ కార్యకర్తలు జనార్దన్, చిర్తపల్లి ఈరన్న, పైంటి లక్ష్మీలకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. జనార్దన్ రెడ్డి భార్య లక్ష్మీ మెడలో ఉన్న మంగళసూత్రంతో పాటు 2 తులాల బంగారు చైన్‌ను వైసీపీ నాయకులు లాక్కెళ్లినట్లు తెలుస్తోంది. బాధితులను ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వైసీపీ నాయకులను చెదరగొట్టారు. ఈ దాడికి ముఖ్య కారణం గ్రామ వైసీపీ నాయకుడు బురుగేని లక్ష్మీరెడ్డి గతంలో కూడా గ్రామంలో వైసీపీని అడ్డం పెట్టుకుని అల్లర్లకు, గొడవలకు పాల్పడుతున్నారని గ్రామస్థులే తెలుపుతుండటం కొసమెరుపు. కోసిగి ఎస్ఐ సతీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# నంద్యాల

**నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం**

## మల్లన్న ఆశీస్సులు బుడ్డాకే..!

**ఆత్మకూరు, జూన్ 4:** రాష్ట్రంలోనే శ్రీశైలం నియోజకవర్గానికి ఎంతో ప్రత్యేకమైన గుర్తింపు వుంది. ద్వాదశజ్యోతిర్లింగాల్లో ఒకటైన శ్రీశైలం క్షేత్రం ఇదే నియోజకవర్గంలో ఉండటంతో సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై రాష్ట్రంలోనే ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఈ ఎన్నికల్లో మల్లన్న ఆశీస్సులు టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన బుడ్డా రాజశేఖరరెడ్డికే వరించడంతో విజయకేతనం ఎగురవేశారు. తొలి నుంచి అనేక సర్వేల్లో శ్రీశైలంలో టీడీపీ జెండా ఎగురవేయడం ఖాయమని చెబుతున్నప్పటికీ ఎన్నికల ఫలితాలు మాత్రం ఉత్కంఠ రేకెత్తించాయి. అయితే హోరాహోరి జరిగిన పోటీలో టీడీపీ అభ్యర్థి బుడ్డా 6385 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. కాగా 2004 నుంచి రెండు దశాబ్దాల పాటు ఇక్కడ టీడీపీ గెలిచిన దాఖలాల్లేవు. అలాంటి పరిస్థితుల్లో ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న బుడ్డా రాజశేఖరరెడ్డి తన విజయంతో చరిత్ర తిరగరాశారు. ఇదిలావుంటే 1978లోనే ఆత్మకూరు నియోజకవర్గం ఏర్పడినప్పటికీ 2009 నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా శ్రీశైలం నియోజకవర్గంగా ఆవిర్భవించింది. ఇప్పటివరకు ఈ నియోజకవర్గంలో మొత్తం 11పర్యాయాలు ఎన్నికలు జరగగా అందులో ఐదుసార్లు కాంగ్రెస్, ప్రస్తుత ఎన్నికలతో కలిపి టీడీపీ నాలుగు సార్లు, వైసీపీ రెండుసార్లు విజయం సాధించాయి. అదేవిధంగా ఎమ్మెల్యేలుగా ఆత్మకూరు బుడ్డా వెంగళరెడ్డి ఒక్కసారి, బుడ్డా వెంగళరెడ్డి మూడుసార్లు, ఏరాసు ప్రతాపరెడ్డి మూడుసార్లు, బుడ్డా సీతారామిరెడ్డి ఒక్కసారి, బుడ్డా రాజశేఖరరెడ్డి రెండు సార్లు, శిల్పా చక్రపాణిరెడ్డి ఒక్కసారి చొప్పున గెలుపొందించారు.


విజయశంఖం పూరిస్తున్న బుడ్డా రాజశేఖరరెడ్డి


కౌంటింగ్ కేంద్రానికి చేరుకుంటున్న బుడ్డా

### 23రౌండ్లలో 17రౌండ్లు టీడీపీకే ఆధిక్యత

శ్రీశైలం నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి మంగళవారం నంద్యాల సమీపంలోని ఆర్‌జీఎం కళాశాల కౌంటింగ్ కేంద్రంలో జరిగిన ఓట్ల లెక్కింపులో టీడీపీగా అభ్యర్థిగా బరిలో నిలిచిన బుడ్డా రాజశేఖరరెడ్డి విజయం సాధించారు. గత నెల 13వ తేదిన శ్రీశైలం నియోజకవర్గంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం 1,96,116 ఓట్లు ఉండగా 1,62,760 ఓట్లు పోలవ్వడంతో 82.99శాతం పోలింగ్ నమోదైంది. వీరిలో 80,355 పురుషులు, 82,379 మహిళలు, 26 మంది ఇతరులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 2380 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన బుడ్డా రాజశేఖరరెడ్డికి 81,699 ఓట్లు, వైసీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన శిల్పా చక్రపాణిరెడ్డికి 75314 ఓట్లు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఇస్మాయిల్‌కు 3429, బీఎస్పీ అభ్యర్థి చంద్రశేఖర్‌కు 567, ఎస్‌డీపీఐ అభ్యర్థి ఎన్‌కే యూనూస్‌కు 750ఓట్లు, నోటాకు 1077 పోలవ్వగా మిగిలిన ఓట్లు ఇతరులకు పోలయ్యాయి. అలాగే పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు సంబంధించి టీడీపీ అభ్యర్థి బుడ్డాకు 1069ఓట్లు, వైసీపీ అభ్యర్థి శిల్పాకు 625, కాంగ్రెస్ అభ్యర్థి ఇస్మాయిల్‌కు 38ఓట్ల చొప్పున వచ్చాయి. మొత్తానికి ఈ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కలిపి వైసీపీ అభ్యర్థి శిల్పాపై టీడీపీ అభ్యర్థి బుడ్డా 6385ఓట్లతో విజయం సాధించారు. అనంతరం శ్రీశైలం రిటర్నింగ్ ఆఫీసర్ సుధారాణి ఎమ్మెల్యేగా గెలుపొందిన టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డికి డిక్లరేషన్ పత్రాన్ని అందజేశారు.

## నందుల కోటపై ఎగిరిన పసుపు జెండా

**నందికొట్కూరు, జూన్ 4:** ఇరవై ఏళ్ల తర్వాత నందుల కోటపై పసుపు జెండా ఎగిరిగింది. గిత్తా జయసూర్య తన సత్తాను చాటుకున్నారు. నందికొట్కూరు అంటే వైసీపీకి అడ్డా అనుకున్న జగన్ కోటకు బీటలు వారేలా చేశారు. నియోజకవర్గంలో 251 పోలింగ్ కేంద్రాల్లో 1,86,853 ఓట్లు ఉండగా టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్యకు 92004 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి ధార సుధీర్‌కు 82212 ఓట్లు రావడంతో గిత్తా జయసూర్య 9792 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థి తోగూరు ఆర్థర్‌కు 7949 ఓట్లు పోలయ్యాయి. ఈ ఓట్ల లెక్కింపు ప్రక్రియ 26 రౌండ్లలో కొనసాగిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాయంత్రం 4 గంటల వరకు సాగింది. 26 రౌండ్లలో వైసీపీ కేవలం 10 రౌండ్లలో మాత్రమే ముందుండగా... మిగిలిన 16 రౌండ్లలో టీడీపీ తన జైత్రయాత్రను కొనసాగించింది. అయితే ప్రతి రౌండు కూడా ఉత్కంఠగా సాగింది. ఉదయం నుంచి టీడీపీ శ్రేణులు టీవీల ముందు కూర్చొని ఓట్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలించారు. టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, ఆయన సతీమణి ఉమాదేవి అల్లూరులోని తమ నివాసంలో ఉంటూ ఓట్ల లెక్కింపు సరళిని ఎప్పటికప్పుడు తెలుసుకున్నారు. గెలుపు ఖాయమవుతుందని తెలుసుకున్న నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులు అల్లూరు చేరుకొని మాండ్ర దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

**20 ఏళ్ల తర్వాత టీడీపీ విజయం:** నందుల కోట అయిన నందికొట్కూరులో టీడీపీ తరుపున 1999లో బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి గెలిచారు. నాటి నుంచి ఇంత వరకు నాలుగు పర్యాయాలు ఎన్నికలు జరిగితే రెండు సార్లు కాంగ్రెస్, మరో రెండు సార్లు వైసీపీ విజయం సాధించింది. అయితే ఈ సారి నందికొట్కూరులో టీడీపీ జెండా ఎలాగైనా ఎగురవేయాలనే ఉద్దేశంతో జయసూర్య గెలుపుకోసం నాయకులు, కార్యకర్తలు కసిగా పని చేశారు. దీంతో గిత్తా జయసూర్య 9,792 ఓట్ల మెజార్టీతో గెలిచారు. నందికొట్కూరులో ఓ సామాన్యుడు ఎమ్మెల్యేగా గెలిచి చరిత్రను తిరగరాశారు.

**గిత్తా జయసూర్య ప్రొఫైల్:**

**పేరు:** గిత్తా జయసూర్య
**విద్యార్హత:** డిగ్రీ డిస్‌కంటిన్యూ
**జన్మస్థలం:** అల్లూరు గ్రామం, నందికొట్కూరు మండలం, నంద్యాల జిలా.
**జన్మించిన తేదీ:** 26-01-1982
**కులం:** మాదిగ
**తల్లి పేరు:** సులోచనమ్మ,
**తండ్రి:** గాంధీ
**భార్య:** బి.సరస్వతమ్మ
**సంతానం:** ఇద్దరు కుమారులు

**తెరుచుకోని వైసీపీ కార్యాలయం:**

ఓట్ల లెక్కింపు ప్రారంభం రోజు నందికొట్కూరు పట్టణంలోని కార్యాలయం తలుపులు తెరుచుకోలేదు. ఓట్లలెక్కింపు ప్రారంభం దశ నుంచి టీడీపీ విజయడంఖా మోగిస్తుండడంతో పట్టణంలోని వైసీపీ కార్యాలయాన్ని తెరిచే వారు కూడా కరువయ్యారు.

**విజయోత్సవాలు**

టీడీపీ విజయం సాధించడంతో నందికొట్కూరు పట్టణంలోని టీడీపీ నాయకులు రబ్బాని కాంప్లెక్స్ వద్ద నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. అలాగే బీజేపీ నాయకుడు దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో చౌడేశ్వరి దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మిఠాయిలను పట్టణ ప్రజలకు పంచిపెట్టారు.

**ప్రజలకు కృతజ్ఞతలు: జయసూర్య**

20 ఏళ్ల తర్వాత నందికొట్కూరులో టీడీపీ జెండా ఎగిరిందని, ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయసూర్య ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానికుడికే పట్టం కట్టిన ఘనత నందికొట్కూరు ప్రజలకే దక్కుతుందన్నారు. రాబోవు రోజుల్లో నందికొట్కూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మాండ్ర సోదరులు, గౌరు వెంకటరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా గెలిచామన్నారు.


విజయకేతనం చూపుతున్న మాండ్ర దంపతులు

**నియంతకు ప్రజలు బుద్ధి చెప్పారు: మాండ్ర**

సంక్షేమం పేరుతో డబ్బులు ఇస్తే తనకే ఓటు వేస్తారులే అని ఒక నియంతా పని చేసిన జగన్ అహంకారానికి రాష్ట్ర ప్రజలు బుద్ధి చెప్పారని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. ప్రజా స్వామ్యంలో గెలిచాక ప్రజల అభివృద్ధి కోసం కృషి చేయకుండా కేవలం వ్యక్తిగత కక్షసాధింపులకు పోవడం వల్లే జగన్‌కు గుణపాఠం చెప్పారన్నారు. రాబోయే రోజుల్లో టీడీపీ హయాంలో నందికొట్కూరుకు తాగు, సాగు నీరు అందించేందుకు కృష చేస్తామన్నారు.

**పోలైన ఓట్లు:1,86,853**
- టీడీపీ: 90,804
- వైసీపీ: 81,535
- కాంగ్రెస్: 7,844
- నోటా: 1,274

**పోస్టల్ బ్యాలెట్ ఓట్లు: 2018**
- టీడీపీ: 1,200
- వైసీపీ: 677
- కాంగ్రెస్: 105

**టీడీపీ మెజార్టీ:9,792**



## టీడీపీ విజయోత్సాహం

టీడీపీ రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. కేక్ కట్ చేసి, ప్రజలకు స్వీట్లు పంచి పెట్టారు. అలాగే ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.


నంద్యాల(నూనెపల్లె): నంద్యాలలో ఎమ్మెల్యే ఫరూక్‌ను సన్మానిస్తున్న నాయకులు


పాములపాడు: క్రిష్ణరావు పేటలో టెంకాయలు కొడుతున్న టీడీపీ నాయకులు


నందికొట్కూరు రూరల్: అల్లూరులో కృతజ్ఞతలు తెలుపుతున్న మాండ్ర ఉమాదేవి


జూపాడుబంగ్లాలో..


శ్రీశైలంలో..


పాణ్యం: ఇందిరానగర్‌లో..


మిడుతూరు: చింతలపల్లిలో..


బండిఆత్మకూరు: సంతజూటూరులో..


కొత్తపల్లి: గువ్వలకుంట్లలో పూజలు


వెలుగోడులో..


పగిడ్యాల: నెహ్రూనగర్‌లో.


ఆత్మకూరు రూరల్: టీడీపీ విజయ సంకేతాన్ని చూపుతూ హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు


గడివేముల: బూజనూరు గ్రామంలో..


మహానందిలో..

## రౌండు.. రౌండులో గెలుపే

- ఊహించని స్థాయిలో పాణ్యంలో టీడీపీది అత్యధిక మెజారిటీ

**కర్నూలు, జూన్ 4:** పాణ్యం నియోజకవర్గంలో టీడీపీ ఊహించని స్థాయిలో విజయం సాధించింది. ప్రతి రౌండులో ఆధిక్యాన్ని సంపాదించుకుంటూ చివరి వరకు ఆధిక్యంలోనే నిలిచింది. గత ఎన్నికల్లో వైసీపీ తరపున ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి 42వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందగా.. అదే స్థాయిలో 41వేల ఓట్ల పైచిలుకుతో గౌరు చరితమ్మ విజయాన్ని సొంతం చేసుకుంది. రాయలసీమ వర్సిటీలో జరిగిన పాణ్యం నియోజకవర్గ ఎన్నికల కౌంటింగ్‌లో ప్రతి రౌండులో విజయం సాధించింది. ఉదయం నుంచే టీడీపీ అభ్యర్థి గౌరు చరిత, వైసీపీ అభ్యర్థి కాటసాని రాంభూపాల్ రెడ్డి ఏజెంట్లతో కలిసి కౌంటింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. రాష్ట్రంలో అత్యధిక రౌండ్లు ఉన్న నియోజకవర్గం కేంద్రంగా పాణ్యం రెండో స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో రాత్రి 8 గంటల వరకు కౌంటింగ్ ప్రక్రియ సాగింది. మొత్తం 26 రౌండ్లలో కౌంటింగ్ ప్రక్రియ జరిగింది. మొదట కల్లూరు మండలం, ఆ తర్వాత అర్బన్ వార్డులు, ఆ తర్వాత ఓర్వకల్లు, గడివేముల, పాణ్యం మండలాల కౌంటింగ్ ప్రక్రియ సాగింది.

- **కల్లూరులోనే విజయం:** మొదట కల్లూరు మండలంలోని పోలింగ్ బూత్‌లను లెక్కించారు. కల్లూరు మండలంలో 58 ఈవీఎంలు ఉండగా.. 54 మిషన్లను 4 రౌండ్లుగా లెక్కించారు. ఈ నాలుగు రౌండ్లలోనే 7,637 ఓట్లతో గౌరు చరితమ్మ ఆధిక్యత చాటింది. ఆ తర్వాత అర్బన్ వార్డుల్లో జరిగే కౌంటింగ్‌పై కాటసాని ఆశలు పెంచుకున్నాడు. పాణ్యం నియోజ కవర్గంలో గెలుపును శాసించేది కల్లూరు అర్బన్ వార్డులే. కల్లూరు అర్బన్ వార్డుల్లో సుమారు 5వ రౌండు నుంచి 15వ రౌండు దాకా సుమారు 11 రౌండ్లుగా కౌంటింగ్ సాగింది. ఈ రౌండ్లలో 19,800 ఓట్ల పైచిలుకు గౌరు చరితమ్మ మెజారిటీ సాధించింది. దీంతో కౌంటింగ్ ప్రక్రియ సాగుతుం డగానే కాటసాని రాంభూపాల్ రెడ్డి అక్కడి నుంచి తన అనుచరులతో కలిసి నిష్క్రమించారు. ఆ తర్వాత ఓర్వకల్లులోనూ టీడీపీ మెజారిటీ సాధించింది. కొంత మెజారిటీ మాత్రమే తగ్గినప్పటికీ విజయం టీడీపీని వరించింది. ఆ తర్వాత గడివేముల, పాణ్యం కూడా అదే స్థాయిలో టీడీపీకి విజయాన్ని అందించాయి.

**ఓట్ల వివరాలివీ..**

- వైసీపీ అభ్యర్థి కాటసాని రాంభూపాల్ రెడ్డికి 99,234 (పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మినహాయించి) ఓట్లు రాగా, టీడీపీ అభ్యర్థి గౌరు చరితకు 1,37,743 (పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మినహాయించి వచ్చాయి. సీపీఐ అభ్యర్థి గౌస్‌దేశాయ్‌కు 2,995 ఓట్లు వచ్చాయి. కాటసానిపై గౌరు చరిత 38,509 మెజార్టీ సాధించారు.
- పాణ్యం నియోజకవర్గంలో నోటాకు కూడా ఓట్లు పడ్డాయి. ప్రతి రౌండులోనూ నోటాకు కూడా ఓట్లను నమోదు చేసుకుంది. మొత్తంగా 26 రౌండ్లలో 2,602 ఓట్లు నోటా సొంతం చేసుకుంది.
- పాణ్యం నియోజకవర్గంలో కాటసాని రాంభూపాల్ రెడ్డికి తనకంటూ ఒక ప్రత్యేక వర్గం ఉంది. 1985 నుంచి ఆయన రాజకీయాల్లో ఉన్నారు. పాణ్యం నియోజకవర్గం తరపున ఆరుసార్లు గెలుపొందారు. ఈసారి మాత్రం ఆయన అభ్యర్థిత్వాన్ని పాణ్యం నియోజకవర్గ ఓటర్లు తిరస్కరించారు. గతంలో 2019లో ఎంత మెజారిటీతో గెలుపొందారో.. అంతే మెజారిటీతో 2024లో ఓడిపోయారు.

## గగ్గటూరులో ఘర్షణ

- ఆరుగురికి గాయాలు

**పాణ్యం, జూన్ 4:** మండలంలోని గగ్గటూరులో మంగళవారం జరిగిన ఘర్షణలో ఐదుగురు టీడీపీ, ఒక వైసీపీ వర్గీయుడికి గాయాలైనట్లు పాణ్యం పోలీసులు తెలిపారు. గ్రామంలో టీడీపీ సంబరాలు నిర్వహిస్తున్న టీడీపీ వర్గీయులపై వైసీపీ వర్గీయులు రాళ్లతో దాడికి దిగడంతో ఘర్షణ చోటుచేసుకుందన్నారు. టీడీపీ వర్గీయులు సంబరాలు చేసుకుంటుండగా వైసీపీ వర్గీయులు నివారించడంతో ఘర్షణ ప్రారంభమైందని స్థానికులు తెలిపారు. ఈదాడుల్లో టీడీపీ వర్గీయులు జమాల్ వలి, జమాల్‌సా, షేక్షావలి, కుల్సాయిబూ, జమాల్ వలికి గాయాలు కాగా.. వైసీపీ వర్గీయులు పార్వతీదేవికి గాయాలైనట్లు తెలిపారు. ఇరువర్గాల పిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పాణ్యం ఎస్‌ఐ అశోక్ తెలిపారు. గాయపడ్డ వారిని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


దాడిలో గాయపడ్డ టీడీపీ వర్గీయులు

## 'ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి'

**నంద్యాల టౌన్, జూన్ 4:** రాయలసీమ ప్రాంతానికి ఎన్నికల ప్రచారానికి ఇచ్చిన హామీలను విశ్వసించి ప్రజలందరూ తెలుగుదేశం పార్టీకి అఖండ మెజార్టీని ఇచ్చిన నేపథ్యంలో ఇచ్చిన హామీలను అమలు పరిచి ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులందరికీ మంగళవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. రాయలసీమ సమానాభివృద్ధితో ఆంధ్రప్రదేశ్ సర్వతో ముఖాభివృద్ధికి కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేయాలని కోరారు.

## ప్రజలకే ఈ విజయం అంకితం: బీసీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, జూన్ 4: ఇది ప్రజా విజయమని, చంద్రబాబుకు, టీడీపీ నాయకులు, కార్యకరలకు, ప్రజలకే ఈవిజయాన్ని అంకితం చేస్తున్నట్లు బనగానపల్లె ఎమ్మెల్యేగా గెలుపొందిన బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బనగానపల్లె ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి నంద్యాల ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు అకుంఠిత దీక్షతో రాష్ట్రమంతా పర్యటించి టీడీపీ విజయం కోసం కృషి చేశారన్నారు. నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో పాల్గొని ప్రజలను, యువతను చైతన్యం చేసి వైసీపీ దుష్టపాలనకు చరమగీతం పాడారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తమ కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు తన విజయానికి కారకులయ్యారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టినా భయపడకుండా టీడీపీని వీడకుండా తన విజయం కోసం కృషి చేశారని బీసీ తెలిపారు. జనసేన, బీజేపీ కార్యకర్తలు కూడా తన గెలుపునకు కృషి చేశారని వారిని బీసీ అభినందించారు. ఎమ్మెల్యేగా గెలుపొందడంతో బాధ్యత మరింత పెరి గిందన్నారు. టీడీపీ ఇచ్చిన సూపర్ 6 వాగ్దానాలు నెరవేర్చి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు.

## బుగ్గన అరాచకాలను ఓడించారు: కోట్ల


మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, జూన్ 4: ఆర్థిక మంత్రి పదవిని అడ్డం పెట్టుకుని బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి డోన్ నియోజకవర్గంలో చేసిన అరాచకాలపై ప్రజలు తిరుగుబాటు చేసి ఓడించారని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం నంద్యాల ఆర్జీఎం ఫార్మసీ కళాశాలలో ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, టీడీపీ యువ నాయకుడు కోట్ల రాఘవేంద్రరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. డోన్ నియోజకవర్గంలో మంత్రి బుగ్గన పోలీసులను అడ్డం పెట్టుకుని టీడీపీ నాయకులును, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టించి ఎంతో వేధించారన్నారు. డోన్ నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలను వేధించి భూకబ్జాలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. టీడీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేసిన వారిని వదిలి పెట్టే ప్రసక్తే లేదని ఉద్ఘాటించారు. తన విజయం కోసం కష్టపడి పని చేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు ఆశీస్సులు అందించిన ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాని అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, కోట్ల గిరిధర్ రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, శేషిరెడ్డి, భాస్కర్ రెడ్డి, లక్ష్మీనారాయణ యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, భాస్కర్ నాయుడు, కొత్తకోట శ్రీను, కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, శివ, ఓంప్రకాష్, సీమ సుధాకర్ రెడ్డి, చంద్రపల్లి ఆచారి, గోసానిపల్లి మల్లయ్య, బీజేపీ నాయకులు వడ్డె మహారాజ్, జనసేన నాయకులు బ్రహ్మం పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్‌లోనూ టీడీపీదే హవా

బనగానపల్లె, జూన్ 4: బనగానపల్లె నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్‌లోనూ టీడీపీ తన సత్తా చాటుకుంది. బనగానపల్లె నియో జకవర్గంలో మొత్తం పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 2778 ఓట్లుపోల్ కాగా ఇందులో టీడీపీకి 1409 ఓట్లు, వైసీపీకి 717 ఓట్లు వచ్చాయి. ఇతరులకు 652 ఓట్లు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డికి మెజార్టీ లభించింది. ఇందులో 610 ఓట్లను తిరస్కరించగా నోటాకు 12 ఓట్లు పడ్డాయి. ఇతరులకు 30 ఓట్లు పడ్డాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో బీసీకి 652 ఓట్లు మెజార్టీ లభించింది. మొత్తం పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కలిసి బీసీ 255,66 ఓట్లతో బీసీ జనార్దన్‌రెడ్డి ఘన విజయం సాధించారు.










# జనార్దన్‌రెడ్డికి జై కొట్టిన జనం

- బనగానపల్లెలో సైకిల్‌దే హవా
- సంబరాల్లో తెలుగు తమ్ముళ్లు
- 25,566 ఓట్ల మెజార్టీతో బీసీ ఘన విజయం

బనగానపల్లె, జూన్ 4: బనగానపల్లె నియోజకవర్గ జనం బీసీ జనార్దన్‌రెడ్డికే జై కొట్టారు. నవాబు కోటలో బీసీ జనార్దన్‌రెడ్డి పాగా వేశారు మంగళవారం బనగానపల్లె అసెంబ్లీ నియోజకవర్గంలో పోలైన ఓట్లను నంద్యాల శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో లెక్కించారు. బనగానపల్లె నియోజకవర్గంలో 2,41,179 ఓట్లు ఉండగా 2,03,575 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 84.41 పోలింగ్ శాతం నమోదైంది. ఇందులో 1,00,432 మంది పురుషులు కాగా 1,03,138 మంది మహిళలు, ఇతరులు ఐదుగురు ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఫలితాల్లో సుమారు 25,566 వేల ఓట్లకు పైగా భారీ మెజార్టీతో టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి గెలుపొందారు. పోలింగ్ రోజు నుంచి కౌంటింగ్ వరకు బనగానపల్లె ఫలితంపై జిల్లా మొత్తం ఆసక్తిగా ఎదురు చూసింది. మొత్తం 2024 ఎన్నికల్లో బీసీ జనార్దన్ రెడ్డి వైసీపీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిపై 27వేలకు పైగా ఘన విజయం సాధించారు. బీసీని బనగానపల్లె నియోజకవర్గం ప్రజలు రెండోసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చారు. 2009లో ఘన విజయం సాధించిన బీసీ జనార్దన్ రెడ్డి 2014లో ఓటమి చెందారు. ప్రస్తుతం భారీ మెజార్టీతో గెలుపొందారు. బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాల్లో మెజార్టీ సాధించి వైసీపీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని ఓడించి విజయ బావుటా ఎగురవేశారు. జిల్లాలోనే బనగానపల్లె నియోజకవర్గం అందరి దృష్టిని ఆకర్షించింది. గత 2009 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే బీసీ 17,361 ఓట్లతో వైసీపీ కాటసాని రామిరెడ్డిపై గెలుపొందారు. ఈ ఎన్నికల్లో కాటసాని రామిరెడ్డిపై గెలిచి సత్తాచాటారు. మొదటి నుంచి తెలుగుదేశం పార్టీకి మంచి పట్టున్న బనగానపల్లె నియోజకవర్గంలో రెండోసారి బీసీని గెలిపించి తెలుగు తమ్ముళ్లు భారీ మెజార్టీతో గెలిపించారు. కేవలం మొదటి రౌండు, 23 వ రౌండ్లలో మాత్రమే మెజార్టీ సాధించింది. మొదటి రౌండ్‌లో 11 88 ఓట్లు, 23వ రౌండ్‌లో 77 ఓట్లు మెజార్టీ వైసీపీ మెజార్టీ సాధించారు. మొత్తం 24 రౌండ్లలో 24 రౌండ్లలో బీసీ మెజార్టీ సాధించి పట్టు నిలుపుకున్నారు.

**రౌండ్ల వారిగా టీడీపీ మెజార్టీ:** బనగానపల్లె నియోజకవర్గంలో మొదటి రౌండ్‌లో వైసీపీకి 1188 ఓట్లు మెజార్టీ వచ్చింది. మిగతా రౌండ్లలో టీడీపీ సునామి సృష్టించింది. ప్రతి రౌండ్‌లోను టీడీపీ పైచేయిసాధించింది. రెండో రౌండ్ నుంచి 22 రౌండ్ వరకు టీడీపీకి మెజార్టీ రాగా, 23వ రౌండ్ వైసీపీకి మెజార్టీ వచ్చింది. మళ్లీ 24వ రౌండు టీడీపీకే మెజార్టీ వచ్చింది. కాగా రెండో రౌండ్‌లో టీడీపీకీ 225 ఓట్లు మెజార్టీ రాగా, మూడవ రౌండ్‌లో నుంచి వరుసగా టీడీపీకి 284 ఓట్లు, 4వ రౌండ్‌లో 1648, 5వ రౌండ్‌లో 1836, 6వ రౌండ్‌లో 543, 7వ రౌండ్‌లో 2718 ఓట్లు, 8వ రౌండ్‌లో 2477, 9వ రౌండ్‌లో 1935 , 10వ రౌండ్‌లో 1533, 11వ రౌండ్‌లో 600 ఓట్లు, 12వ రౌండ్‌లో 1202, 13వ రౌండ్‌లో 748, 14వ రౌండ్‌లో 524, 15వ రౌండ్‌లో 1553, 16వ రౌండ్‌లో 854, 17వ రౌండ్‌లో 1351, 18వ రౌండ్‌లో 1047, 19వ రౌండ్‌లో టీడీపీకి 660, 20వ రౌండ్‌లో 2294, 21వ రౌండ్‌లో 806, 22వ రౌండ్‌లో 966, 24వ రౌండ్‌లో 86, 23వ రౌండ్‌లో వైసీపీకి కేవలం 77 ఓట్లు మెజార్టీ వచ్చాయి. ఈ ఎన్నికల్లో కూటమి సునామీ వీచింది. బీసీ ముందు జగన్ సంక్షేమ పథకాలు ఏమాత్రం పనిచేయలేదు. టీడీపీ కార్యకర్తలకు, టీడీపీ నాయకులకు వైసీపీ నాయకులు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినప్పటికీ, కేసులు పెట్టినా, భయభ్రాంతులకు గురిచేసినా టీడీపీ నాయకులు ఏమాత్రం భయపడక ఏ మాత్రం లెక్కచేయకుండా టీడీపీ విజయానికి గణనీయమైన కృషి చేశారు. అలాగే పోలింగ్ రోజు బనగానపల్లె నియోజకవర్గంలో ఘర్షణలు జరుగుతాయని అందరూ ఊహించారు. అయితే ఎలాంటి చిన్నపాటి ఘర్షణలు కూడా జరగకపోవడంతో ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ముఖ్యంగా మహిళలు ఉదయం 5 గంటల నుంచే పోలింగ్ బూత్‌లో ఓటు వేయడానికి వచ్చి టీడీపీకి ఓటు వేశారు, రాత్రి 10 గంటలవరకు ఓటర్లు ఓటు వేశారు. ముస్లిం మైనార్టీలు ఎమ్మెల్యే బీసీ గెలుపులో కీలకపాత్ర పోషించారు. ముఖ్యంగా అవుకు మండలంలో గుండ్ల శింగవరం, అన్నవరం, నిచ్చెనమెట్ల, కోనాపురం, పెద్దకొట్టాల, గడ్డమేకల పల్లె, ఉప్పలపాడు, కొండమనాయినిపల్లె, గ్రామాల్లో స్వాతంత్ర్యం అనంతరం తొలిసారి ప్రజలు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మహిళలు రాత్రి సమయంలో కూడా క్యూలైన్లో వేచి ఉండి ఓట్లు వేసి బీసీ గెలుపులో ప్రధానపాత్ర వహించారు.

**డిక్లరేషన్ ఫారం అందుకున్న బీసీ:** బీసీ జనార్దన్‌రెడ్డి మంగళవారం ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా బనగానపల్లె రిటర్నింగ్ అధికారి కామేశ్వరరావు చేతుల మీదుగా డిక్లరేషన్ ఫారం అందుకున్నారు. రిటర్నింగ్ అధికారి కామేశ్వరరావు చేతుల మీదుగా బీసీ జనార్దన్‌రెడ్డి డిక్లరేషన్‌ఫారం అందుకున్నారు. ఆయన వెంట బీసీ జనార్దన్‌రెడ్డి కుమారుడు మనోహర్‌రెడ్డి కూతురు మనోరమ, కోడలు క్షీరారెడ్డి, ఇతర కుటుంబ సభ్యులు, టీడీపీ నాయకులు ఉన్నారు.


విజయకేతనం చూపిస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి


ప్రజలకు అభివాదం తెలుపుతున్న ఎమ్మెల్యే బీసీ

**బనగానపల్లెలో బీసీకి ఘన స్వాగతం:** బనగానపల్లె ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన బీసీ జనార్దన్‌రెడ్డికి పట్టణ ప్రజలు, టీడీపీ శ్రేణులు మంగళవారం రాత్రి ఘన స్వాగతం పలికారు. డిక్లరేషన్ పత్రాలు అందుకున్న బీసీ బనగానపల్లెకు చేరుకున్న సందర్భంగా నందివర్గం, నందవరం, పండ్లాపురం, తిమ్మాపురం, గ్రామాల్లో బీసీకి ఘన స్వాగతం పలికారు. వేలాది మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు బీసీ వెంట రాగా బ్రహ్మంగారి చింతమానుమఠం, జీఎం టాకీస్, పోస్టాపీసు రోడ్డు, ఆస్థానంరోడ్డు మీదుగా బనగానపల్లె టీడీపీ కార్యాలయం చేరుకు న్నారు. టీడీపీ కార్యాలయం సమీపంలో బాణ సంచాపేల్చి బీసీకి ఘన స్వాగతం పలికారు. అలాగే బీసీ రాజారెడ్డిని భుజాల మీద ఎత్తుకొని బీసీ జనార్దన్‌రెడ్డి వద్దకు అభిమానులు చేర్చారు. ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ రాజారెడ్డి అభివాదం తెలుపు తూ టీడీపీ నాయ కులు, కార్యకర్తలకు అభివాదం తెలిపారు, బీసీకి పూలబొకేలు, పూలమాలలతో స్వాగతం పలికారు.

# కోట్ల సంచలన విజయం

- మంత్రి బుగ్గనపై 6,049 ఓట్ల మెజార్టీ
- రెపరెపలాడిన టీడీపీ జెండా

డోన్, జూన్ 4: డోన్ అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ జెండా రెపరెపలాడింది. టీడీపీ కూటమి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి సంచలన విజయం సాధించారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిపై టీడీపీ అభ్యర్థి కోట్ల ప్రకాష్‌రెడ్డి 6,049 ఓట్లతో గెలుపొందారు. 2024సార్వత్రిక ఎన్నికల్లో డోన్ అసెంబ్లీ కూటమి అభ్యర్థిగా కోట్ల ప్రకాష్‌రెడ్డి పోటీ చేయగా, వైసీపీ నుంచి మంత్రి బుగ్గన పోటీ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ గార్లపాటి మద్దిలేటితో పాటు మరో 13మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీలో నిలిచారు. మంగళవారం నంద్యాల సమీపంలోని ఆర్జీఎం ఫార్మసీ కళాశాలలో ఎన్నికల అధికారి మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో డోన్ అసెంబ్లీ ఓట్లను లెక్కించారు.

**6,049 మెజారిటీతో కోట్ల గెలుపు:** డోన్ అసెంబ్లీ నియోజకవర్గంలోని 291 పోలింగ్ కేంద్రాలలో మొత్తం 1,88,187 ఓట్లు పోలయ్యాయి. ఇందులో టీడీపీ అభ్యర్థి కోట్ల ప్రకాష్‌రెడ్డికి 92,421 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి రాజారెడ్డికి 86,690 ఓట్లు వచ్చాయి. దీంతో కూటమి అభ్యర్థికి 5,731 ఓట్ల మెజారిటీ లభించింది. పోస్టల్ బ్యాలెట్ల ద్వారా 2,158 ఓట్లు పోలు కాగా..1936 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు అర్హత పొందాయి. ఇందులో టీడీపీకి 1,102 ఓట్లు రాగా, వైసీపీకి 784 ఓట్లు వచ్చాయి. 222 ఓట్లు తిరస్కరణకు గురికాగా, నోటాకు 11 పోస్టల్ బ్యాలెట్లు వేశారు. పోస్టల్ బ్యాలెట్లలో టీడీపీ అభ్యర్థి కోట్లకు 318 ఓట్ల మెజారిటీ వచ్చింది. దీంతో డోన్ అసెంబ్లీ నుంచి కూటమి అభ్యర్థి కోట్ల ప్రకాష్‌రెడ్డి 6,049 ఓట్ల మెజారిటీతో బుగ్గనపై గెలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి గార్లపాటి మద్దిలేటికి 3,961 ఓట్లు రాగా, నోటాకు 1362 ఓట్లు వచ్చాయి.

**తొలి రౌండు నుంచి ఆధిక్యత:** డోన్ అసెంబ్లీ ఓట్ల లెక్కింపులో తొలి రౌండు నుంచే టీడీపీ కూటమి అభ్యర్థి కోట్ల ప్రకాష్‌రెడ్డి ఆధిక్యం ప్రదర్శించారు. తొలి రౌండులో టీడీపీ అభ్యర్థికి మొత్తం 21 రౌండులలో టీడీపీ అభ్యర్థికి 17 రౌండ్లలో ఆధిక్యం రాగా, వైసీపీ అభ్యర్థికి కేవలం 4 రౌండ్లలో మాత్రమే ఆధిక్యం లభించింది. మొదటి రౌండులో కోట్లకు 555 ఓట్ల ఆధిక్యం వచ్చింది. 2వ రౌండులోను టీడీపీకి 24 ఓట్లు, 3వ రౌండులో టీడీపీకి 329 ఓట్లు, 4వ రౌండులో టీడీపీకి 247 ఓట్లు, 5వ రౌండులో టీడీపీకి 573 ఓట్లు, 7వ రౌండులో టీడీపీకి 51 ఓట్ల ఆధిక్యం, 8వ రౌండులో టీడీపీ 840 ఆధిక్యం, 9వ రౌండులో టీడీపీకి 318 ఓట్ల ఆధిక్యం, 10వ రౌండులో వైసీపీకి 496 ఓట్లు అధిక్యం, 11వ రౌండులో టీడీపీకి 998 ఆధిక్యం, 13వ రౌండులో టీడీపీకి 478 ఓట్లు, 15వ రౌండులో టీడీపీకి 50 ఓట్లు, 16వ రౌండులో టీడీపీకి 1469 ఓట్లు ఆధిక్యం, 17వ రౌండులో టీడీపీకి 224 ఓట్లు, 18వ రౌండులో 251 ఓట్లు టీడీపీ, 19వ రౌండులో టీడీపీకి 54 ఓట్లు, 20వ రౌండులో టీడీపీకి 680 ఓట్లు, 21వ రౌండులో టీడీపీ 951 ఓట్ల ఆధిక్యాన్ని ప్రదర్శించారు. వైసీపీకి 6వ రౌండులో 687ఓట్లు, 10వ రౌండులో 496 ఓట్లు, 12వ రౌండులో వైసీపీ 138ఓట్లు, 14వ రౌండులో 1032 ఓట్లు వైసీపీకి ఆధిక్యం వచ్చింది.


డోన్ అసెంబ్లీ ఓట్ల లెకింపును పరిశీలిస్తున్న కోట్ల

**డిక్లరేషన్ ఫారం అందుకున్న కోట్ల:** డోన్ ఎమ్మెల్యేగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అధికారికంగా డిక్లరేషన్ అందుకున్నారు. మంగళవారం నంద్యాల సమీపంలోని ఆర్జీఎం ఫార్మసీ కళాశాలలో ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత ఎన్నికల రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డి ఎన్నికల ఫలితాన్ని ప్రకటించారు. టీడీపీ కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి 93,523 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి 87,474 ఓట్లు వచ్చినట్లు ఆర్వో తెలిపారు. టీడీపీ అభ్యర్థి కోట్ల 6,049 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు ఆర్వో ప్రకటించారు. అనంతరం సాయంత్రం 4.30 గంటలకు డోన్ ఎమ్మెల్యేగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆర్వో చేతుల మీదుగా డిక్లరే షన్ అందుకున్నారు.

**కోట్లకు టీడీపీ శ్రేణుల ఘనస్వాగతం**

**బేతంచెర్ల:** డోన్ శాసనభ్యులుగా అత్యధిక మెజారిటీతో గెలిచిన కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి మంగళవారం స్థానిక పాతబస్టాండులో టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. ముందుగా టీడీపీ నాయకులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్ర మంలో టీడీపీ పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, బుగ్గన మాధవి రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు పోలూరు శ్రీనివాసరెడ్డి, పోలూరు రాఘవరావు, మండల సమన్వయ చైర్మన్ చంద్రశేఖర్, సుధాకర్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు

- జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చిత్రపటానికి టీడీపీ, జనసేన నాయకులు క్షీరాభిషేకం చేశారు. జనసేన మండల అధ్యక్షుడు చల్లా మద్దిలేటి స్వామి ఆధ్వర్యంలో కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మధు పాల్గొన్నారు.

## అన్ని మండలాల్లోనూ టీడీపీకి మెజార్టీ

డోన్, జూన్ 4: డోన్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో టీడీపీ కూటమి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి మెజారిటీ లభించింది. మంగళవారం నిర్వహించిన ఓట్ల లెక్కింపులో అన్ని మండలాల నుంచి మెజారిటీని కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సాధించారు. మంత్రి బుగ్గన సొంత మండలం బేతంచెర్లలోనే టీడీపీకి అత్యధిక మెజారిటీ రావడం సంచలనంగా మారింది. డోన్ రూరల్‌లో టీడీపీకి 22,301 ఓట్లు రాగా, వైసీపీకి 20,291 ఓట్లు వచ్చాయి. దీంతో డోన్ రూరల్‌లో టీడీపీకి 2010 మెజారిటీ లభించింది. డోన్ అర్బన్‌లో టీడీపీకి 16,782 ఓట్లు రాగా, వైసీపీకి 16,720 ఓట్లు వచ్చాయి. దీంతో టీడీపీకి 62 ఓట్ల మెజారిటీ లభించింది. ప్యాపిలి మండలంలో టీడీపీకి 23,759 ఓట్లు రాగా, వైసీపీకి 23,628 ఓట్లు వచ్చాయి. దీంతో టీడీపీకి 131 ఓట్ల మెజారిటీ వచ్చింది. బేతంచెర్ల మండలంలో టీడీపీకి 29,580 ఓట్లు రాగా, వైసీపీకి 26,053 ఓట్లు వచ్చాయి. దీంతో బేతంచెర్ల మండలంలో టీడీపీకి 3,527 ఓట్లు మెజారిటీ లభించింది.

## వేంకటేశ్వరస్వామికి జగత్ విఖ్యాత్‌రెడ్డి పూజలు

రుద్రవరం, జూన్ 4: భూమా అఖిలప్రియ గెలవాలని జగత్ విఖ్యాత్‌రెడ్డి మండలంలోని వాసాపురం వేంకటేశ్వరస్వామి, మానస లింగేశ్వరస్వామి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. రెండు ఆలయాల్లో పూజలు చేసి కౌంటింగ్ కేంద్రం వద్దకు నేరుగా వెళ్లారు. రంగనాయకులు, ప్రమీల మ్మ, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

## వ్యక్తిపై దాడి

ఆళ్లగడ్డ, జూన్ 4: ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పడకండ్ల మైసూరయ్య కుమారుడు సిద్ధయ్య పై అదే గ్రామానికి చెందిన నొస్సం వెంకటేశ్వర్లు, యోగి, రఘు, పెద్ద వెంకటేశ్వర్లు కర్రతో నుదుటిపై దాడి చేసి రక్తగాయాలు చేశారని పట్టణ ఎస్ఐ నగినా మంగళవారం చెప్పారు. ఏ పార్టీ గెలిస్తే ఏమి చేస్తుందని అనడంతో దాడి చేశారని సిద్ధయ్య ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె చెప్పారు.

## రౌండ్ల వారిగా టీడీపీకి భారీ మెజార్టీ

బనగానపల్లె, జూన్ 4: బనగానపల్లె అసెంబ్లీకి నిర్వహించిన మంగళవారం నిర్వహించిన కౌంటింగ్‌లో ప్రతి రౌండ్‌లోను టీడీపీ సత్తా చాటింది. మొత్తం 25,566 ఓట్లలో బీసీ ఘన విజయం సాధించారు. తొలి రౌండ్, 23వ రౌండ్లు తప్ప మిగతా 22 రౌండ్లలో టీడీపీ భారీ విజయం సాధించించి ఎమ్మెల్యేగా బీసీ జనార్దన్‌రెడ్డి ఘన విజయం సాధించారు. తొలి రౌండ్‌లో వైసీపీకి 1188 ఓట్లు మెజార్టీ వచ్చింది. రెండో రౌండ్‌లో టీడీపీకి 963, మూడో రౌండ్‌లో టీడీపీకి 679 ఓట్లు, 4వ రౌండ్ నుంచి వరుసగా టీడీపీకి 969 ఓట్లు, 5వ రౌండ్‌లో 2805, 6వ రౌండ్‌లో 3348, 7వ రౌండ్‌లో 6066, 8వ రౌండ్‌లో 8543, 9వ రౌండ్‌లో 10,478లో, 10వ రౌండ్‌లో 12,011, 11వ రౌండ్‌లో 12,611, 12వ రౌం డ్‌లో 13,813, 13వ రౌండ్‌లో 14,561, 14వ రౌండ్‌లో 15,085లో, 15వ రౌండ్‌లో 16,618లో, 16వ రౌండ్‌లో 17,492, 17వ రౌండ్‌లో 18,863, 18వ రౌండ్‌లో 19,890, 19వ రౌండ్‌లో 20,550, 20వ రౌం డ్‌లో 22,844, 21వ రౌండ్‌లో 23,650, 22వ రౌండ్‌లో 24,678, 23వ రౌండ్‌లో వైసీపీకి 77 ఓట్లు, చివరిగా 24వ రౌండ్‌లో టీడీపీకి 24,769 ఓట్లు మెజార్టీ వచ్చింది. పోస్టల్ బ్యాలెట్‌లతో కలసి 25,566 ఓట్లతో బీసీ ఘన విజయం సాధించారు.

## 144 సెక్షన్‌తో అంతా నిర్మానుష్యం ..

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 4: కౌంటింగ్ నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టడంతో పల్లెలు, పట్టణాలు నిర్మానుష్యంగా మారాయి. 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ అమలు చేయడంతో కొలిమిగుండ్లతో పాటు పల్లెల్లో సైతం అన్నిరకాల దుకాణాలు మూసివేశారు. వాహనాల రాకపోకలను అడ్డుకోవడంతో రోడ్లు సైతం నిర్మానుష్యంగా మారాయి. ప్రజలను ఇళ్లకే పరిమితం చేసేలా పోలీసులు చేపట్టిన చర్యలు సఫలీకృతమయ్యాయి. మధ్యాహ్నం వరకు ఏ ఒక్కరూ ఇళ్ల నుండి బయటికి రాకపోవడంతో వీధులన్నీ బోసిపోయాయి.

**డోన్(రూరల్):** డోన్ పట్టణంలో ఎన్నికల కౌంటింగ్‌ను పురస్కరించుకుని డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐ ప్రియతమ్‌రెడ్డిల ఆధ్వర్యంలో 144 సెక్షన్ అమలు చేయడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. తెల్లవారుజాము నుంచే పట్టణ ప్రధాన రోడ్లలో ఉన్న టీ హోటళ్లు, కిరాణం, బట్టల దుకాణాలు మూసేశారు.

## ఓట్ల లెక్కింపు బంద్ ప్రశాంతం

ఆళ్లగడ్డ, జూన్ 4: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా నిర్వహించిన బంద్ సంపూర్ణంగా జరిగింది. ఆళ్లగడ్డ పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్‌శాఖ ముందస్తు జాగ్రత్తతో నిర్వహించిన ఈ బంద్‌లో ప్రజలు తమ వంతు సహకారాన్ని అందించారు. దీంతో పట్టణంలోని అన్ని రకాల దుకాణాలను మూసివేశారు. ఆర్టీసీ బస్సులు యథావిధిగా తిరిగినప్పటికి ప్రయాణికులు లేకపోవడంతో బస్టాండు వెలవెలబోయింది.


కోవెలకుంట్లలో గడ్డం రామకృష్ణారెడ్డి ఇంటి వద్ద సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

## టీడీపీ శ్రేణుల సంబరాలు

డోన్(రూరల్), జూన్ 4: రాష్ట్రంలో టీడీపీ ప్రభంజనం సృష్టించడంతో మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ సంబరాలు అంబరాన్నంటాయి. డోన్‌లో టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి వైసీపీపై విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు, కార్యక ర్తల బాణసంచాలు పేలుస్తూ స్వీట్లను పంపిణీ చేసుకున్నారు. అనంతరం డోన్ టీడీపీ కార్యాలయానికి కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున చేరుకుని సంబరాలు చేసుకున్నారు.

**కోవెలకుంట్ల:** టీడీపీ ప్రభంజనానికి రాష్ట్రంలో వైసీపీ కొట్టుకుపోయి చివరకు ప్రతిపక్ష హోదా లేకుండా పది సీట్లకే పరిమితమైందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి, కోవెలకుంట్ల మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గడ్డం నాగేశ్వరరెడ్డిలు అన్నారు. మంగళవారం కోవెలకుంట్ల పట్టణంలోని గడ్డం రామకృష్ణారెడ్డి ఇంటి వద్ద టీడీపీ కార్యకర్తలతో కలసి సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా గడ్డం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ బీసీ జనార్దన్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం ఇది ప్రజా విజయమన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

**ప్యాపిలి:** సార్వత్రిక ఎన్నికల్లో డోన్ కూటమి అభ్యర్థి కోట్ల ప్రకాష్‌రెడ్డి గెలుపొందడంతో మం గళవారం పట్టణంలో కూటమి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి బాణ సంచా పేల్చారు. అనంతరం హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు.

**శిరివెళ్ల:** రాష్ట్రంలో ఎన్డీఏ కూటమిలోని టీడీపీ భారీ మెజార్టీతో గెలుపొందడం, ఆళ్లగడ్డలో టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ విజయం సాధించడంతో టీడీపీ శ్రేణులు మంగళవారం సంతోషం వ్యక్తం చేశారు. శిరివెళ్లలో మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, ఎంపీటీసీ యామా శ్రీనివాసులు నాయకులు, కార్యకర్తలకు స్వీట్లు పంచిపెట్టారు.

**చాగలమర్రి:** చాగలమర్రి మండలంలో ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ భారీ మెజార్టీతో విజయం సాధించడంతో టీడీపీ నాయకులు, జనసేన నాయకులు, కార్యకర్తలు కలిసి మంగళవారం ఆనందం వ్యక్తం చేశారు. టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, జనసేన నాయకులు, కార్య కర్తలు ఉన్నారు. న్యూబిల్డింగ్స్ వీధిలో టీడీపీ నాయకుడు జెట్టి నాగరాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

**ఉయ్యాలవాడ:** ఉయ్యాలవాడలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఫొటోలకు క్షీరాభిషేకం చేసి కేక్ కట్ చేశారు. ఒకరికొకకరు కరచాలనం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఉయ్యాలవాడలో బలిజసంఘం నాయకులు శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటానికి పూలమాల వేశారు.

**ఆళ్లగడ్డ:** సార్వత్రిక ఎన్నికల్లో ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా భూమా అఖిలప్రియ గెలుపొందడంతో ఆళ్లగడ్డ పట్టణంలోని ఆమె ఇంటి వద్ద టీడీపీ కార్యకర్తలు, అభిమానులు సంతోషం వ్యక్తం చేశారు.

**రుద్రవరం:** ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా భూమా అఖిలప్రియ విజయం సాధించడంతో డి.కొట్టాలు గ్రామంలో నాయకుడు కృష్ణారెడ్డి కేక్ కట్ చేశారు. ఆలమూరు, రుద్రవరం, రెడ్డిపల్లె, టి.లింగందిన్నె ఇంకా పలు గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు.

**దొర్నిపాడు:** సార్వత్రిక ఎన్నికల ఓటింగ్‌లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి విజయకేతనం ఎగురవేసిందని టీడీపీ మండల నాయకులు మల్లేశ్వర చౌదరి, లింగుట్ల వెంకట్‌నాయుడు, కొత్తపల్లి సురేంద్ర, బబ్బూరి వెంకటస్వామి, చక్రవర్తి నాయుడు, సిద్ధి సత్యంలు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం చాకరాజువేములలో లింగుట్ల వెంకట్‌నాయుడు ఇంటి ఆవరణలో కేక్ కట్ చేశారు.

**అవుకు:** బనగానపల్లె నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి 25,566 ఓట్ల భారీ మెజార్టీతో గెలవడంతో అవుకు మండలంలోని నాయకులు, కార్యకర్తలు మంగళవారం సంబరాలు చేసుకున్నారు. గ్రామాల్లో టీడీపీ నాయకుల ఇళ్ల వద్దకు టీడీపీ కార్యకర్తలు చేరుకొని ఆనందాన్ని పం చుకున్నారు. టీడీపీ నాయకులు గూడాల ప్రభాకరెడ్డి, మురళీధర్‌రెడ్డి, కునుకుంట్ల గ్రామ సర్పంచ్ రామకృష్ణారెడ్డి, నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

**సంజామల:** అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో వైసీపీని ప్రజలు భూస్థాపితం చేశారని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెండేకంటి కిరణ్‌కుమార్ అన్నారు. బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.


చాగలమర్రి టీడీపీ కార్యాలయం వద్ద టీడీపీ శ్రేణుల సంబరాలు


బేతంచెర్లలో...